



# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU

సంపుటి : 6 | సంచిక : 57 | పేజీలు : 8 | వెల : రూ.2/- బుధవారం 25 మార్చి 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## పునర్విభజనపై వాస్తవిక దృక్పథంతో
# ముందుకు వెళ్దాం

- పునర్విభజనతో మరిన్ని అవకాశాలు
- గెలుపే లక్ష్యంగా స్థానిక పోరుకు సిద్ధమవ్వండి
- నిలబడిన ప్రతి చోటా జనసేన జెండా ఎగిరేలా కష్టపడండి
- నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్ళాలి
- వారంలో ఒకరోజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం తప్పనిసరి
- పార్టీ బలంగా ఉంటేనే ప్రజాప్రతినిధులు బలంగా ఉంటారు
- పార్టీ నేతలకు జనసేనాని పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం



**విజయవాడ,మన జనప్రగతి మార్చి 24:** నియోజక వర్గాల పునర్విభజన వల్ల అవకాశాలు మరింత పెరుగుతాయని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో ఆయన సుమారు మూడు గంటలకు పైగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీలపై చర్చించారు. నియోజక వర్గాల్లో సమస్యలపై ఆరా తీశారు. కమిటీల ఏర్పాటు విషయంలో పిఠాపురం మోడల్‌ని మిగతా నియోజక వర్గాల్లోనూ అమలు చేయాలని సూచించారు. కూటమి పార్టీల సయోధ్య విషయంలో దిశానిర్దేశం చేశారు.పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమై పలు ముఖ్య అంశాలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులు, తాజా రాజకీయ పరిణామాలపై సమగ్రంగా చర్చించి నేతలకు పవన్ దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంలో ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా, వాస్తవిక మిగతా2లో...



## సిఎం చంద్రబాబుతో
# సంజయ్ దత్ భేటీ

- అమరావతిలో ఫిలిం సిటీ వ్యవహారాలపై చర్చ

**అమరావతి,మన జనప్రగతి మార్చి 24:** అమరావతిలో త్వరలోనే ఏపీలో భారీ సినీ స్టూడియోలు లేదా అంతర్జాతీయ స్థాయి ఫిలిం సిటీ నిర్మాణంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం కనిపిస్తోంది. మంగళవారం గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సంజయ్ దత్ బృందం నేరుగా వెలగపూడిలోని సచివాలయానికి వెళ్లి ముఖ్యమంత్రిని కలిశారు. గత ఫిబ్రవరిలో ముంబై వేదికగా మంత్రి నారా లోకేశ్‌తో జరిగిన చర్చల కొనసాగింపుగానే ఈ పర్యటన సాగుతున్నట్లు తెలుస్తోంది. సంజయ్ దత్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన ముగ్గురు కీలక ప్రముఖులు మిగతా2లో...

## పశ్చిమాసియా
# ఉద్రిక్తతలు


- ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్





## మతం మారితే
# ఎస్సీ హక్కులు కోల్పోతారు

- క్రిష్టియానిటిలో కుల వ్యవస్థ లేదు
- క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ హక్కులు ఉండవు
- హిందువుల,సిక్కు, బౌద్ధ మత్‌స్థులకే కుల హక్కులు
- ఎపి హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 24:** మతమార్పిడికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన ఎస్సీలకు ఆ హోదా ఉండదని స్పష్టం చేసింది. క్రిష్టియన్‌లోకి మారిన వారికి ఎస్సీ కింద లభించే వెసలుబాటు ఉందదని తేల్చింది. మతం మారితన తరవాత అట్రాసిటీ చట్టం కింద కేసులపై సుప్రీంకోర్టు మిగతా2లో...






## కోవిడ్ విషాదాలను మరచిన ప్రధాని మోడీ

- మండిపడ్డ విపక్ష నేత రాహుల్

**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 24:** పశ్చిమాసియా ఉద్రిక్తతలను గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటులో మాట్లాడుతూ పరిస్థితి కోవిడ్ తరహాలా మిగతా2లో...

## అమరావతిలో మరోమారు
# అగ్నిప్రమాదం

- వరుస ప్రమాదాలపై చంద్రబాబు అనుమానం
- దర్యాప్తు చేసి నిగ్గు తేల్చాలని ఆదేశం



**అమరావతి,మన జనప్రగతి మార్చి 24:** రాజధాని అమరావతిలో మరోసారి భారీ అగ్నిప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి రాయపూడి సమీపంలో ప్రిన్సిపల్ సెక్రటరీల భవనాల వద్ద నిర్మాణ ప్రాంగణంలో చోటు చేసుకుంది. కాంట్రాక్టు సంస్థ మేఘా కంపెనీకి చెందిన ప్లాస్టిక్ పైపుల వద్ద అకస్మాత్తుగా నిప్పులు చెలరేగాయి. దీంతో భారీగా మంటలు ఎగిసిపడటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలికి చేరుకుని సహాయక చర్యలను సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా అమరావతిలో ఇటీవల కూడా భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ నెల 11న ఎల్ అండ్ టీకి చెందిన ప్లాస్టిక్ పైపులు తగలబడటంతో కోట్లాది రూపాయల నష్టం జరిగింది. రాజధాని అమరావతిలోని ప్రాంతం రాయపూడిలో మిగతా2లో...



## మిట్టల్ ప్రాజెక్ట్
# ఉత్తరాంధ్రకు వరం

- ఇక్కడి పారిశ్రామిక అభివృద్ధిలో కీలకం
- కేంద్రమంత్రి రామ్మోమన్ నాయుడు

**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 24:** అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ఏపీ పారిశ్రామిక రంగంలో చారిత్రాత్మక ఘట్టమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర తలరాతను మార్చనున్న మెగా స్టీల్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఇదని పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌గా ఏపీ ప్రాజెక్ట్ రికార్డు సృష్టించనుందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. లక్షలాదిమందికి పైగా నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనుందని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. ఏటా 17 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యంతో మిగతా2లో...

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు
# బెదిరింపు మెయిల్

- మోడీ,అమిత్ షా,జైశంకర్‌లను కూడా లేపేస్తామని హెచ్చరిక
- ఢిల్లీ మెట్రో, అసెంబ్లీ లకు బాంబు బెదిరింపులు




# ఎపిలో ఉగ్రలింకుల కలకలం

- విజయవాడలో ముగ్గురు యువకుల అరెస్ట్



**విజయవాడ,మన జనప్రగతి మార్చి 24:** ఏపీలో ఉగ్రలింకులు కలకలం రేపాయి. ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలున్నాయనే అనుమానంతో విజయవాడలో ముగ్గురు యువకులను ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వించిపేటకు చెందిన ఇద్దరు 21 ఏళ్ల యువకులతో పాటు, భవానీపురానికి చెందిన 20 ఏళ్ల యువకుడిని అరెస్టు చేసి రహస్యంగా విచారిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉగ్రమూలాలపై కేంద్ర నిఘా సంస్థల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు నిరంతర నిఘా పెట్టారు. ఇందులో భాగంగా సోషల్‌మీడియా కార్యకలాపాలపైనా దృష్టిసారించారు. ఈ క్రమంలో ముగ్గురు యువకులు ఉగ్రవాద సంస్థలకు అనుకూలంగా పోస్టులు పెడుతున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్ పోలీసులు.. వారి నివాసాల్లో సోదాలు నిర్వహించారు. మిగతా2లో...

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
25 -03-2026

# పునర్విభజనపై వాస్తవిక దృక్పథంతో ముందుకు వెళ్దాం

(మొదటి పేజీ తరువాయి)

దృక్పథంతో ప్రజాప్రతినిధులు ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు. 2009లో చివరిసారిగా పునర్విభజన జరిగినప్పుడు రాష్ట్రం, దేశంలో చోటు చేసుకున్న అంశాలను ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకోవాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా, ప్రజా ప్రయోజనమే పరమార్థంగా, సహేతుకంగా పునర్విభజన జరిగేలా జనసేన ప్రజా ప్రతినిధులు ముందుకు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా జనసేన ప్రజాప్రతినిధులు అన్ని వర్గాలకు చేరువలో (రీచ్ అవుట్) ఉంటూ... నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులతో మంగళవారం విజయవాడలో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నియోజక వర్గాల పునర్విభజన నిర్ణయం వల్ల రాష్ట్రంలో అసెంబ్లీతోపాటు పార్లమెంట్ స్థానాలు పెరుగుతాయి. ఇప్పుడున్న నియోజకవర్గాలను 50 శాతం పెంచాలన్న కేంద్రం నిర్ణయం హర్షణీయం. కేంద్రం నిర్ణయంతో 88 అసెంబ్లీ సీట్లు, 12 వరకు పార్లమెంట్ సీట్లు కొత్తగా పెరుగుతాయి. అంటే కొత్తగా 100 మంది ప్రతినిధులను చట్ట సభలకు పంపించే అవకాశం వచ్చింది. దీనిని దృష్టిలో పెట్టుకొని డీలిమిటేషన్ ఎక్కడా దుర్వినియోగం కాకుండా చూసే బాధ్యత మనపై ఉంది. డీలిమిటేషన్ పై జనసేన ఏ విధంగా ముందుకు వెళ్లాలి? ఎటువంటి కార్యాచరణ అవలంబించాలి? అనే అంశాలపై సూచనలు చేయడానికి శాసనసభ్యులతో కూడిన కమిటీ నియమించాలని పార్టీ పీఏసీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారికి సూచిస్తున్నాను. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా డీలిమిటేషన్ పై పార్టీ కార్యాచరణ నిర్దేశిరచుకుందాం. కొద్ది నెలల్లో రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు రానున్నాయి. కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు పని చేయాలి. ఆ నిర్ణయం ప్రజలు హర్షించేలా ఉండాలి. వ్యక్తులు చేసిన పనులు వ్యక్తులకే పరిమితం అవ్వాలి. అంతే తప్ప వాటి ఆధారంగా పార్టీపై ప్రభావం పడకూడదు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా నిధులు సమకూర్చాము. వాటి సద్వినియోగంపై అందరూ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. అవి క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేరువ కావాలి. జల్ జీవన్ మిషన్ 2 .0 కి ఈ రోజు ఎం.ఓ.యూ. చేసుకున్నాము. జల్ జీవన్ నిధులతో ప్రతి ఇంటికీ తాగు నీరు ఇచ్చే లక్ష్యంతో పని చేస్తున్నాము. ప్రతి నియోజకవర్గానికి పీఆర్ ఆర్డీ శాఖలు, ఆర్. డబ్ల్యు.ఎస్. ద్వారా నిధులు అందుతున్నాయి. వాటి ద్వారా చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు తెలియచెప్పాల్సిన బాధ్యత మీపైనే ఉంది' అన్నారు.జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... 'సంఖ్యాపరంగా అసెంబ్లీలో జనసేన పార్టీ రెండో స్థానంలో ఉండటం మనందరికీ గర్వ కారణం. స్థానిక సంస్థల ఎన్నికలకు స్థానికంగానే వ్యూహరచన చేసుకోవాలి. డీలిమిటేషన్ లో చేర్పులు, మార్పులు, విభజన ప్రక్రియలు జిల్లా యంత్రాంగం చేతుల్లో కేంద్రీకృతమై ఉంటాయి. గతంలో జరిగిన డీలిమిటేషన్ ప్రక్రియ ఆధారంగా ఈ మాటలు చెబుతున్నాను. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి చోట గెలిచి నూటికి నూరు శాతం ఫలితాలు రాబట్టుకోవాలి అని కోరారు. లెజిస్లేటివ్ పార్టీ సమావేశం ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. 3 గంటల సేపు కొనసాగిన ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రారంభోపన్యాసం చేశారు. ఆ తరువాత గ్రూపులుగా, విడివిడిగా అందరి సభ్యులతో కలిసి మాట్లాడారు. ఈ సమావేశంలో అనేక అంశాలు ప్రస్తావనకు వచ్చిన క్రమంలో ముఖ్యమైన అంశాల మీద అధ్యయనానికి పార్టీకి, సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రజాప్రతినిధులతో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీకి సూచించారు. చర్చించిన అంశాలు ప్రజలు, పార్టీకి ఉపయోగపడేలా మలుచుకోవాలని సూచించారు. ప్రతి నెల 3 లేదా 4వ వారంలో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల అందరితో సమావేశమవు తానని చెప్పారు. వచ్చే నెల తొలి వారంలో ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తామని,రాజకీయంగా పార్టీ శ్రేణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గురించి చర్చిస్తామని చెప్పారు.

# మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

(మొదటి పేజీ తరువాయి)

కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని స్పష్టం చేసింది. హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని పేర్కొంది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి.. మంగలశారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంపై అక్కల రామిరెడ్డితో పాటు స్థానికులు అభ్యంతరం తెలిపారు. వారిపై అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆనంద్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టివేయాలంటూ రామిరెడ్డి, స్థానికులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండటంతో క్రైస్తవుడవుతారని.. రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలకు సంబంధం ఉండదని రామిరెడ్డి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. పుట్టుకతో హిందువు అయినా.. క్రైస్తవం స్వీకరించడంతో ఆనంద్ షెడ్యూల్ కులానికి చెందరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించవని, ఫిర్యాదు చట్ట వ్యతిరేకమని.. తమపై పెట్టిన కేసుకు విచారణార్హత లేదని వాదించారు. రామిరెడ్డి తరఫు న్యాయవాదుల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. క్రైస్తవ మతంలో కులవ్యవస్థ లేదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా కాకుండా మతం మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని తేల్చి చెప్పింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. పాస్టర్ ఆనంద్ దశాబ్దానికి పైగా క్రైస్తవంలో ఉన్నారని.. తిరిగి మారలేదని నిరూపణ అయిందని ధర్మాసనం పేర్కొంది.

# ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్

**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 24:** దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. అయి తే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు. ఈ బెదిరింపులపై తామేమీ భయ పడటం లేదని, అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, భద్రత విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. ఇక ఢిల్లీ అసెంబ్లీలో బ్జడెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా సీఎం రేఖా గుప్తా కూడా అసెంబ్లీకి చేరుకున్నారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు ఆరాతీస్తున్నారు.

# ఎపిలో ఉగ్రలింకుల కలకలం

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, విదేశాల్లో ఉగ్రవాద చర్యలకు ఆకర్షితులై సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టినట్లుగా ముగ్గురు యువకులు ప్రాథమిక విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీరిని రహస్యప్రదేశంలో విచారిస్తున్నారు. వీరికి ఏ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయి? వీరిని ఉగ్రవాదం వైపు ఎవరు ప్రేరేపిస్తున్నారు? వీరికి సోషల్‌మీడియా లింకులు ఎలా వస్తున్నాయన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విజయవాడ టెర్రర్‌కు హైదరాబాద్‌తో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్ర కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తున్న ముగ్గురు యువకులకు హైదరాబాద్‌కు చెందిన మహిళతో సంబంధాలు ఉన్నట్లుగా సమాచారం. ఆ మహిళే కీలక సూత్రధారి అని పోలీసులు భావిస్తున్నారు. విజయవాడలో ముగ్గురు అనుమానితుల్ని అరెస్టు చేసిన వెంటనే.. ఆమె పరారవ్వడం ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది.

## లొంగిపోయిన మావోయిస్ట్ నేత పాపారావు

**బీజాపూర్,మన జనప్రగతి మార్చి 24:** మావోయిస్టు అగ్రనేత పాపారావు అలియాస్ సున్నం చంద్రయ్య పోలీసుల ఎదుట లొంగిపోయాడు. 17 మంది అనుచరులతో బీజాపూర్ ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. లొంగిపోయిన వారిలో 10 మంది పురుషులు, 8 మంది మహిళలు ఉన్నారు. వారి నుంచి భారీగా ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బస్తర్ ప్రాంతానికి చెందిన పాపారావుపై రూ.2 కోట్ల రివార్డు ఉంది. అతడిపై 50 కేసులు ఉన్నాయి. సుక్మా జిల్లా కలెక్టర్ అపహరణ ఉదంతంలో పాపారావు కీలక పాత్ర పోషించాడు. 76 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలోనూ ఇతడి హస్తం ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

# పార్లమెంటులో వైసిపికి 11వ నంబర్ గది

● కంగారుతో మార్చాలని స్పీకర్‌కు వినతి: 12 నంబరు కేటాయిస్తూ ఆదేశాలు



**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 24:** ఢిల్లీలోని పార్లమెంటు భవనంలో గదుల కేటాయింపు వ్యవహారం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, '11' అనే సంఖ్యకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధం ఈ ఘటనతో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. కొత్త పార్లమెంటు భవనంలో ఆయా పార్టీల బలాబలాలను చూసి స్పీకర్ కార్యాలయం గదులను కేటాయిస్తుంది. అయితే వైసీపీ ఎంపీలకు కేటాయించిన గది నంబర్ వారిని తీవ్ర కలవరానికి గురిచేసింది. స్పీకర్ కార్యాలయం మొదట వైసీపీకి మొదటి అంతస్తులో 11వ నంబర్ గదిని కేటాయించింది. ఈ నంబర్ చూడగానే వైసీపీ ఎంపీలు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ కేవలం 11 స్థానాలకే పరిమితమైంది. సోషల్ మీడియాలో నెటిజన్లు వైసీపీని '11' అంటూ ఎద్దేవా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు పార్లమెంటులో కూడా అదే నంబర్ రావడం ఫ్యాన్ పార్టీ నేతలను విస్మయానికి గురిచేసింది. తమకు ఇచ్చిన గది నంబర్ మార్చాలని కోరుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ ఎంపీలు హుటాహుటిన స్పీకర్‌ను కలిశారు. 11వ నంబర్ గదిని ఎందుకు వద్దంటున్నారని స్పీకర్ ప్రశ్నించగా.. ఆ నంబర్ తమకు కలిసి రావడం లేదని, ఏపీలో తమ పార్టీ గెలిచిన సీట్ల సంఖ్య కూడా అదే కావడంతో అందరూ హేళన చేస్తున్నారని ఫ్యాన్ పార్టీ నేతలు వివరించారు. ఆ పార్టీ ఎంపీల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న స్పీకర్, వారికి 12వ నంబర్ గదిని కేటాయించారు. దీంతో వైసీపీ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. రాజకీయాల్లో సంఖ్యాశాస్త్రం సెంటిమెంట్లకు ఎంత ప్రాధాన్యం ఉంటుందో ఈ ఘటన నిరూపిస్తోంది. ఒకప్పుడు 151 సీట్లతో రికార్డు సృష్టించిన పార్టీ, ఇప్పుడు '11' అనే అంకెను చూసి భయపడటం రాజకీయ విచిత్రమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి పార్లమెంటు మొదటి అంతస్తులో 9వ నంబర్ గదిని కేటాయించారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ కీలక పాత్ర పోషిస్తోండటంతో, ప్రధానమైన గదుల్లో ఒకటి వారికి దక్కింది.

# సిఎం చంద్రబాబుతో సంజయ్ దత్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ భేటీలో పాల్గొన్నారు. గౌరవ్ దూబే , కునాల్ పటేల్, అనుజ్ కుమార్ వీరిలో ఉన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఒక భారీ ఫిలిం సిటీ లేదా సినిమా హబ్ అవసరం ఎంతైనా ఉంది. గతంలో లోకేశ్‌తో జరిగిన భేటీలో సంజయ్ దత్ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారు. ఈ ఫిలిం సిటీని అమరావతి పరిసరాల్లో లేదా విశాఖపట్నంలో ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. సినిమా షూటింగ్‌ల కోసం ఏపీని ఒక గమ్యస్థానంగా మార్చడానికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, మౌలిక సదుపాయాలపై సీఎం చంద్రబాబు సంజయ్ దత్ బృందానికి వివరించినట్లు తెలుస్తోంది. ఏపీలో సినిమా ఇండస్ట్రీకి అవసరమైన లొకేషన్లు పుష్కలంగా ఉన్నాయి. సంజయ్ దత్ వంటి అగ్ర నటులు ఇక్కడ స్టూడియోలు లేదా ఫిలిం సిటీలను నిర్మిస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. బాలీవుడ్, సౌత్ సినిమాల కలయికతో ఏపీ సినీ హబ్‌గా మారుతుందని ప్రబుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు

**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 24:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారంనాడు ఫోన్ చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులు, హోర్ముజ్ జలసంధి తెరిపించాల్సిన అవసరంపై ఇరువురు నేతలు చర్చించారు. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. 'అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడే ప్రధాని మోదీతో మాట్లాడారు. హోర్ముజ్ జలసంధిని తెరిపించాల్సిన అవసరంతో పాటు పశ్చిమాసియాలో పరిస్థితిపై ఉభయులూ చర్చించారు' అని సెర్గియో గోర్ ఆ ప్రకటనలో తెలిపారు. రాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై ఐదు రోజులపాటు దాడులు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ సోమవారంనాడు సంచలన ప్రకటన చేశారు. రెండ్రోజులుగా ఇరాన్‌తో జరుపుతున్న చర్చలు ఫలప్రదంగా సాగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అయితే అమెరికాతో చర్చలను ఇరాన్ కొట్టివేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోనులో సంభాషించినట్టు ప్రధానమంత్రి మోదీ ట్వీట్ చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితులపై తమ మధ్య ఉపయోగకరమైన చర్చ జరిగిందన్నారు. వీలైనంత త్వరలో ఉద్రికతలు తొలగేందుకు, శాంతి పునరుద్ధరణకు భారత్ మద్దతు ఉంటుందని తాను స్పష్టం చేసినట్టు పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి తెరవడం, రక్షణ కల్పించడం, అందరికీ అందుబాటులోకి తేవడం యావత్ ప్రపంచానికి అవసరమని పేర్కొన్నారు.

# కోవిడ్ విషాదాలను మరచిన ప్రధాని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

ఉందంటూ పేర్కొనడంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో జరిగిన విషాదాల గురించి ఆయన మరిచిపాయారా? అని ప్రశ్నించారు. పార్లమెంటు వెలుపల మీడియాతో రాహుల్ మంగళవారంనాడు మాట్లాడారు. 'పార్లమెంటులో ఆయన నిన్న సందర్భోచితం కాని మాటలు మాట్లాడారు. కరోనా మహమ్మారితో ప్రస్తుత సందర్భాన్ని పోల్చారు. ఎల్పీజీ, పెట్రోల్ ధరల్లో ఇప్పుడే పెరుగుదల మొదలైంది. ఇంతలోనే పరిస్థితిని కరోనా మహమ్మారి రోజులతో ఆయన పోలుస్తున్నారు. కరోనా విరుచుకుపడిన సమయంలో జరిగిన విషాదాల గురించి ఆయన మరిచిపోయినట్టున్నారు' అని రాహుల్ అన్నారు. దేశ విదేశాంగ విధానంపై రాహుల్ విమర్శలు గుప్పిస్తూ, దేశ విదేశాంగ విధానం మోదీ వ్యక్తిగత విదేశాంగ విధానంగా మారిందని, అంతర్జాతీయంగా ఇదొక హాస్యాస్పద అంశంగా మారిందని అన్నారు. 'మోదీ రాజీపడితే మన విదేశాంగ విధానం కూడా రాజీపడినట్టే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ రాజీకొచ్చినట్టే కనిపిస్తోంది' అని వ్యాఖ్యానించారు. మధ్యఆసియాలో పరిణామాలపై ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అఖిలపక్ష సమావేశంపై అడిగినప్పుడు, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినా సరిదిద్దుకోలేని నిర్మాణాత్మక తప్పిదం జరిగిందని అన్నారు. అమెరికా ఏది చెబితే అది మోదీ చేస్తారని, రైతులు, దేశ ప్రయోజనాల కోసం పనిచేయరని విమర్శించారు. కేరళలో తనకు ప్రోగ్రాం ఉన్నందున అఖిల పక్ష సమావేశానికి హాజరుకాకపోవచ్చని చెప్పారు.

# అమరావతిలో మరోమారు అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయంలో మంగళవారం సమీక్ష చేశారు. రాయపూడిలో హెచ్‌వోడీ టవర్ల నిర్మాణం వద్ద మెగా సంస్థకు చెందిన ప్లాస్టిక్ పైపులు రాత్రి దగ్ధమైన ఘటనపై ప్రాథమిక సమాచారాన్ని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. రాజధాని ప్రాంతంలో తరుచూ అగ్రిప్రమాదాలు జరగడంపై సీఎం అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రమాదమా, కుట్రకోణం ఉందా అనే విషయంలో సమగ్ర విచారణ జరపాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే మూడు ఘటనల్లో వివిధ కాంట్రాక్టు సంస్థలకు చెందిన నిర్మాణ సామాగ్రి దగ్ధమైందని తెలిపారు. రాజధాని అమరావతిలోని రాయపూడి వద్ద నూతనంగా నిర్మిస్తున్న అఖిల భారత సర్వీస్ అధికారుల టవర్ల సమీపంలో పైపులు కాలిపోయాయి. ఇది ప్రమాదమా...?, కుట్రకోణమా అనే దానిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల వెలగపూడి సమీపంలో సీడ్ యాక్సిస్ రోడ్ వద్ద కొందరు ఉద్దేశపూర్వకంగా పైపులకు నిప్పు పెట్టినట్లు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అలాగే మెగా సంస్థకు చెందిన పైపులకు కొందరు ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టారా అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టారు.

# మిట్టల్ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రకు వరం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగనుందని వివరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఈ ప్రాజెక్ట్ కీలక మైలురాయని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషితో ఈ భారీ ప్రాజెక్ట్ సాకారమైందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఆర్సెలార్ మిట్టల్ - నిప్పన్ స్టీల్ ఇండియా ప్లాంట్ ఇంజిన్‌గా మారనుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# బిల్లుల చెల్లింపును హైకోర్టులో తేల్చుకోండి

● పెద్దిరెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ



**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 24:** వైసీపీ నేత పెద్దిరెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో తన కంపెనీకి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని కోరుతూ ఆయన సతీమణి పేరిట దాఖలు చేసిన పిటిషన్‌ను, ఏపీ హైకోర్టులోనే పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది.గత ప్రభుత్వ కాలంలో పి.ఎల్.ఆర్ కంపెనీ ద్వారా చేపట్టిన రోడ్డు పనులకు సంబంధించి బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బిల్లులను వెంటనే చెల్లించేలా ఆదేశించాలని సుప్రీంకోర్టును పెద్దిరెడ్డి ఆశ్రయించారు. అయితే, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు నేరుగా జోక్యం చేసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం, ఈ అంశంపై ముందుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. దీనిపై పెద్దిరెడ్డి తరఫు న్యాయవాదులు ఇప్పటికే ఏపీ హైకోర్టులో 12 కేసులు దాఖలు చేసినట్లు సుప్రీంకోర్టుకు వివరించారు. అయినప్పటికీ, హైకోర్టు పరిధిలోనే ఈ అంశం పరిష్కారం కావాలని ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో, సుప్రీంకోర్టు సూచనల మేరకు పెద్దిరెడ్డి తరఫు న్యాయవాదులు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో ఈ కేసు ప్రస్తుతం హైకోర్టులోనే కొనసాగనుంది.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
25 -03-2026

# ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి తీసుకురావాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 24:–** ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ నుండి ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియ అంశం పై ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియ ఆదోని, పాణ్యం, కర్నూలు నియోజకవర్గాల్లో నెమ్మదిగా సాగుతోందని, వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. సంబంధిత నియోజకవర్గాల తహసిల్దార్ లు, బిఎల్ఓ లతో సమావేశం నిర్వహించుకుని మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ తహసిల్దార్ లను ఆదేశించారు. ఆలూరు, కోడుమూరు లాంటి నియోజకవర్గాలు మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి బాగా తీసుకొని వచ్చారని, మిగిలిన నియోజకవర్గాల్లో కూడా అదే విధంగా పురోగతి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా క్లెయిమ్స్, డెమోగ్రాఫిక్ కరెక్షన్ కి సంబంధించిన వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, తహసిల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణలో రాజీ పడవద్దు

- నేర నియంత్రణే లక్ష్యంగా పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలి
- డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలి
- పోలీసు అధికారులతో నెల వారి నేర సమీక్షా సమావేశం





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 24:–** నేర నియంత్రణలో రాజీ పడకుండా నేర నివారణే ప్రథమ లక్ష్యంగా పని చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులకు ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైల తో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులతో మాట్లాడుతూజిల్లాలో నేర నియంత్రణను కట్టుదిట్టం చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ ల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ప్రజల ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించి ప్రాధాన్యత కేసులను 7 రోజుల్లో పరిష్కరించాలన్నారు.రాత్రి గస్తీ లు , విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలన్నారు.రౌడీ షీటర్ల పై నిఘా ఉంచాలన్నారు.మొబైల్ రికవరీ, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళల భద్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మార్చి 28 నుంచి క్రికెట్ బెట్టింగ్ పై నిఘా ఉంచాలన్నారు. డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తులను పకడ్బందీగా చేయించాలన్నారు.గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు,సిబ్బందికి ఎస్పీ గారు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా,లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు,డిఎస్పీలు వెంకట్రామయ్య , ఉపేంద్రబాబు,భార్గవి , సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.


# గండి దేవస్థానంలో అర్చకుల ఘర్షణపై స్పష్టత: ఈఓ ప్రకటన

**ఉగాది పండుగ రోజున జరిగిన ఘటనపై వివరణ.**

**ప్రధాన అర్చకుడు వి.కేసరి,ఉప ప్రధాన అర్చకుడు వి.రాజా రమేష్ మధ్య వివాదం.**

**తాయత్తుల విక్రయాలపై బ్రేక్..హారతి డబ్బుల నిర్వహణపై కొత్త నిబంధనలు.**

**దేవస్థాన ప్రతిష్ట దృష్టిలో చర్యలు..భక్తుల విశ్వాసం కాపాడేందుకు నిర్ణయం.**




**పులివెందుల/చక్రాయపేట మన జనప్రగతి మార్చి 24:–** కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రం శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఉగాది పండుగ పర్వదినమున అనగా 20వ తేదీ గురువారం ప్రధాన అర్చకుడు వి.కేసరి మరియు ఉప ప్రధాన అర్చకుడు వి.రాజా రమేష్ ల మధ్య హారతి పళ్ళెంలో భక్తులు సమర్పించే కానుకల విషయంలో ఘర్షణ చోటుచేసుకున్న ఘటనపై దేవస్థానం అధికారులు విచారణ చేపట్టారు.ఈ ఘటనపై సోషల్ మీడియా,ఎలక్ట్రానిక్ మీడియా మరియు పత్రికల్లో నైవేద్యం సమర్పించలేదని వచ్చిన వార్తల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాలయాల సంరక్షణ సమితి అధ్యక్షుడు పుష్పాల శ్రీనాథరెడ్డి కూడా స్పందిస్తూ..ఉగాది రోజున నైవేద్యం నిర్లక్ష్యం జరిగిందని ఆరోపించారు.అయితే విచారణలో అర్చకులు స్పందిస్తూ,నైవేద్యం సమర్పించలేదన్నది పూర్తిగా అవాస్తవమని తెలిపారు.గ్యాస్ కొరత కారణంగా బాలాలయం మరియు మూలవిరాట్ వద్ద నైవేద్యం సమర్పణలో కేవలం అరగంట ఆలస్యమే జరిగినట్లు వివరణ ఇచ్చారు.ఈ అంశంపై మంగళవారం సాయంత్రం ఒక ప్రకటన ద్వారా దేవస్థానం ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి పి.గురు ప్రసాద్ వెల్లడిస్తూ..నైవేద్యం విషయంలో ఎటువంటి అపచారం జరగలేదని స్పష్టం చేశారు.అయితే ఆలయ ప్రతిష్టను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ఇకపై నిత్య కైంకర్యాలు సమయానికి నిర్వహించాల్సిందిగా,హారతి పళ్ళెంలో వచ్చిన కానుకలను వెంటనే హుండీలలో వేయాల్సిందిగా,అలాగే ఆలయ పరిధిలో భక్తులకు ఎలాంటి తాయత్తులు విక్రయించరాదని అర్చకులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఈఓ పి.గురు ప్రసాద్ తెలిపారు.దేవస్థానం పరిపాలనలో క్రమశిక్షణ పాటిస్తూ భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టాలని అధికారులు కోరారు.

# ఆస్తుల విషయంలో వ్యక్తిత్వ హననం చేస్తున్న వైఎస్ షర్మిల!



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మార్చి 24:–** ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మంగళవారం స్థానిక దొరసానిపల్లె లోని ఆయన నివాసంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఆస్తుల విషయమై వైసీపీ అధినేత రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వ్యక్తిత్వ హననం చేసేలా షర్మిలమ్మ వ్యాఖ్యానిస్తోందని, దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి బ్రతికున్న సమయంలోనే ఆయన ఆస్తిని జగన్, షర్మిల కు సమానంగా పంచారని, వారు కూడా దాన్ని అంగీకరించారని వివరించారు. అదేవిధంగా ఆస్తి పంపకం తర్వాత జగన్ కష్టార్జితం నుండి సంపాదించిన ఆస్తిలో షర్మిల కు కొంత ఇస్తానని ఎంఓయు చేశారని, కానీ ఆ తర్వాత ఆమె జగన్ కు వ్యతిరేకంగా వ్యవహరించడంతో ఆ ఎంఓయు రద్దు చేశారని స్పష్టం చేశారు. ఆస్తి విషయంలో జగన్ తొలుత కోర్టుకెళ్లారని మాట్లాడారని, కానీ జగన్ ఆస్తులు ఈడికి అటాచ్ అయిన సందర్భంలో ఆయన ఆస్తులు బదిలీ చేస్తే జైలుకెళ్తారని తెలిసి బదిలీ చేయాలని షర్మిల కోర్టు కు వెళ్లిన పక్షంలో జగన్ కేవలం ఆత్మరక్షణ కోసం ట్రిబ్యునల్ ముందుకు వెళ్లారని స్పష్టం చేశారు. మొన్నటి విజయమ్మ నోటరీలో కూడా ఆమె సంతకం కాదని, అది నకిలీ కాదని తాము చెప్పలేదని తెలిపారు. అదేవిధంగా ఆమె జగన్ ను దమ్ము, ధైర్యం లేని వ్యక్తి గా అభివర్ణించారని, ఆస్తుల విషయంలో జగన్ స్పందించలేక అతని అనూనయులతో మాట్లాడించారని, మాట్లాడిన వారిని ఆమె దూషించారని, అయినా బాధ లేదని, ఆమె తెలిసో తెలియకో తమను విశ్వాసానికి మారుపేరైన జంతువుతోనే పోల్చారని, తాము జగన్ కు విశ్వాస పాత్రులమని, జగన్ ను విమర్శిస్తే తాము స్పందిస్తామని వివరించారు. జగన్ స్పందించకపోవడానికి కారణం ఆయన సంస్కారం, కుటుంబ గౌరవం, చెల్లెల పట్ల అప్యాయతే అని స్పష్టం చేశారు. తాము వైఎస్ఆర్ కుమార్తెను ఏనాటికీ దూషించలేమని స్పష్టం చేశారు. ఆమె ఈ విధంగా మాట్లాడుతూ మాట్లాడుతూ చివరికి వివేకానంద రెడ్డి హత్య విషయాన్ని తేవడం, అది భారతి రెడ్డి కి ఆపాదించడం సబబు కాదన్నారు. కేవలం ఆమె మీడియాలో ప్రచురించడం, ప్రసారం చేయడం తప్పు అనిపిస్తే మిగిలిన పత్రికలు, ఛానల్స్ కూడా అదే పని చేశాయని గమనించాలన్నారు. పత్రికలు, మీడియా ఛానల్స్ కేవలం స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన కథనాలే ప్రచురిస్తాయని వివరించారు. ఆ విధంగా వివేకానంద రెడ్డి గుండెపోటుతో మరణించాడని తొలుత తెలిపింది ఆయన బావమరిది శివప్రకాష్ రెడ్డి అని తెలిపారు. జగన్, భారతీ రెడ్డి వ్యక్తిత్వం హననం చేసేలా వ్యాఖ్యానిస్తే ప్రతిఘటిస్తామని తెలియజేశారు.

# రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో సహకరించాలి



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 24 :–** రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ ల మ్యాపింగ్ ప్రక్రియలో సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి /జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి రాజకీయ ప్రతినిధులను కోరారు.మంగళవారం కలెక్టరేట్ లో ఓటర్ల మ్యాపింగ్, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి /జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ కార్యక్రమం చురుకుగా జరుగుతోందని, ఇందులో ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకుని రావాలని కోరారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు పార్టీల బూత్ ఏజెంట్లు ఈ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తయ్యేందుకు వీలుగా సహకరించాలని కోరారు. ప్రభుత్వం తరపున బిఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓటర్లను మ్యాపింగ్ చేస్తున్నారని, బూత్ లెవెల్ ఏజెంట్లు వారి పార్టీల తరఫున బీఎల్ ఓ లకు సహకరించాలని పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. అర్హులైన ఓటర్లను నమోదు చేయించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు.ఓటర్ ల మ్యాపింగ్, ఓటర్ల నమోదు కార్యక్రమం పై ప్రజలకు , విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీల ప్రతినిధులు జిల్లా ఎన్నికల అధికారి / జిల్లా కలెక్టర్ ను కోరారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ కార్యాలయం కాంప్లెక్స్ లో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ల గోడౌన్ ను తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రతకు సంబంధించి ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఈవీఎం లకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ, డబుల్ లాక్ విధానం, ఎంట్రీ–ఎగ్జిట్ రిజిస్టర్ నిర్వహణ వంటి తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.తనిఖీ మరియు సమావేశంలో బహుజన సమాజ్ వాదీ పార్టీ తరపున డిస్ట్రిక్ట్ ఇంచార్జ్ అరుణ్ కుమార్, బిజెపి పార్టీ తరపున పి.టి.సాయి ప్రదీప్, నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున బజారన్న, తెలుగుదేశం పార్టీ తరపున ఎల్.వి. ప్రసాద్, సత్రం రామకృష్ణుడు , వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున ఎస్ ఏ షరీఫ్ , జనసేన పార్టీ తరపున తల్లా మంజునాథ్ ( డైరెక్టర్ , వాల్మీకి కార్పొరేషన్) , ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీటీ 'రెన్యూవల్' ఘనత మంత్రి లోకేశ్‌దే: మంత్రి సవిత

**ఆర్డీటీతో వేలాది మందికి మేలు**

**సంస్థ విదేశీ నిధుల సమీకరణ నిలిపేసిన కేంద్రం**

**లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగానే సమస్యకు పరిష్కారమైందంటూ హర్షం**

**కేంద్రానికి కూడా ధన్యవాదాలు**

**ఆర్డీటీ భూములపై గతంలో వైసీపీ కన్ను**

**గత ప్రభుత్వ కుట్రపై ఆనాడే ఉద్యమించిన టీడీపీ : మంత్రి సవిత**



**అమరావతి మన జనప్రగతి మార్చి 24:–** అనంతపురంలోని రూరల్ డవలప్ మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ) సంస్థకు నిధుల సమీకరణకు విదేశీ నిధుల రెన్యూవల్ (ఎఫ్.సి.ఆర్.ఎ)ను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. ఈ ఘనత ముమ్మాటికీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకశ్ దేనని కొనియాడారు. వారికి రాష్ట్రంలోని పేదల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్డీటీ భూములు కొట్టేయాలని చూస్తే, ఆనాటి ప్రతిపక్షంలో ఉన్న తాము ఆ సంస్థకు అండగా నిలిచామన్నారు. ఆర్డీటీ ఎఫ్.సి.ఆర్.ఎను కేంద్ర ప్రభుత్వం నిలిపేసినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఇచ్చిన హామీకి కట్టుబడుతూ, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కూటమి ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్.సి.ఆర్.ఎ ను పునద్ధరించిందన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. రాయలసీమ గడ్డపై సేవ అనే పదానికి ఆర్డీటీ మారు పేరుగా నిలిచిందన్నారు. 60 ఏళ్ల నుంచి ఆ సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లాలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆపద్బాంధవిలా నిలుస్తూ, సామాజిక సేవలు అందిస్తోందన్నారు. స్పెయిన్ నుంచి వచ్చిన విన్సెంట్ ఫెర్రర్, ఆన్ ఫెర్రర్ దంపతులు అనంతపురంలోని వెనుకబడిన ప్రాంతాలను చూసి చలించిపోయారన్నారు. ఆర్డీటీ సంస్థను స్థాపించి పేదలకు విద్య, వైద్య సేవలు అందించారన్నారు. ఇళ్లు లేని వేలాది మందికి గృహ సదుపాయం కల్పించారని, మరికొందరు పేదలకు వ్యవసాయం కోసం భూములిచ్చారని, ఆధునిక పనిముట్లు అందిస్తూ రైతులకు తోడుగా నిలిచారని కొనియాడారు. ముఖ్యంగా, క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందజేశారని, ఎందరో అనంతపురం క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన సందర్భాలున్నాయన్నారు. ఆర్డీటీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుతో ఎందరో పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అత్యవసర చికిత్స కోసం బెంగళూరుకో, హైదరాబాద్‌కో వెళ్లాల్సిన అవసరం తప్పిందన్నారు. ముఖ్యంగా గర్భిణులకు ఈ ఆసుపత్రి ఓ వరమన్నారు. వేలాది మంది పేద బిడ్డలను చదివించి ఆ సంస్థ ప్రయోజకులను చేసిందని మంత్రి కొనియారు. **ఈ ఘనత ముమ్మాటికీ లోకేశ్ దే...** గత వైసీపీ ప్రభుత్వం ఆర్డీటీ వంటి సేవా సంస్థను కూడా రాజకీయ కక్షతో వేధించిందని మంత్రి సవిత మండిపడ్డారు. దీనివల్ల ఎందరో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఇదే సమయంలో ఆర్డీటీ నిధుల సమీకరణలో కీలకమైన విదేశీ నిధుల రెన్యూవల్ (ఎఫ్.సి.ఆర్.ఎ)ను కేంద్ర ప్రభుత్వం నిలిపేసిందన్నారు. ఇదే విషయమై తనతో పాటు టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు.. సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకొచ్చామన్నారు. దీనిపై మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందిస్తూ, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడారన్నారు. ప్రధాని నరేంద్రమోడి, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ను ఒప్పించి, ఆర్డీటీ సంస్థకు నిధుల సమీకరణకు విదేశీ నిధుల రెన్యూవల్ (ఎఫ్.సి.ఆర్.ఎ) పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ ఘనత ముమ్మాటికీ మంత్రి నారా లోకేశ్ దేనని మంత్రి సవిత కొనియాడారు. **వైసీపీ కుట్రలను అడ్డుకున్నాం** వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన ఆర్డీటీ సంస్థ భూములను సైతం కొట్టేయడానికి ఆనాటి వైసీపీ ప్రభుత్వం కుట్ర పన్నిందని మంత్రి సవిత మండిపడ్డారు. అనంతపురం నగరం శివార్లలోని రుద్రంపేట సర్వే నెం.106లో ఉన్న 4.20 ఎకరాల భూమిని వెనక్కి తీసుకోవాలని గత ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. అప్పుడు ప్రతిపక్షంగా ఉన్న తమ పార్టీ తీవ్రస్థాయిలో ఉద్యమించిందన్నారు. అదే సమయంలో ఆ భూములపై ఆర్డీటీ కూడా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుందన్నారు. మంత్రి నారా లోకేశ్ తన యువగళం పాదయాత్రలో ఆనాటి వైసీపీ ప్రభుత్వ అన్యాయాన్ని స్వయంగా చూశారన్నారు. ఆనాడే ఆయన మాటిచ్చారని, కూటమి ప్రభుత్వం రాగానే ఆర్డీటీ ఆస్తులను కాపాడతామని, సంస్థ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, ఆర్డీటీ సంస్థ విదేశీ నిధుల రెన్యూవల్ (ఎఫ్.సి.ఆర్.ఎ)ను పునరుద్ధరణకు కృషి చేశారని అన్నారు. ఉమ్మడి అనంతపురంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల తరఫున సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

## ఇస్నాపూర్‌లో డ్రైనేజ్ సమస్యలపై నిర్లక్ష్యం



**పటాన్ చెరువు మన జనప్రగతి మార్చి 24:-** ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ఇటీవల జరిగిన ఎన్నికల అనంతరం కొత్త కౌన్సిలర్లు బాధ్యతలు స్వీకరించినప్పటికీ, స్థానిక సమస్యల పరిష్కారంలో తగిన చర్యలు కనిపించడం లేదు. కౌన్సిలర్ అభ్యర్థి వినతిపత్రం సమర్పించి డ్రైనేజ్ మరమ్మతులు చేయాలని కోరినప్పటికీ, అధికారులు నామమాత్రంగా కొన్ని చోట్ల మాత్రమే పనులు చేసి మధ్యలోనే వదిలివేశారు.ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ, చెత్త నీరు వీధుల్లో నిల్వ ఉండటంతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. అనేకసార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ, ఇస్నాపూర్ మున్సిపాలిటీ కమిషనర్ మరియు సంబంధిత విభాగం అధికారులు ఈ సమస్యను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తులను కూడా పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. వెంటనే డ్రైనేజ్ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి, ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రొద్దుటూరు పోలీస్ శాఖ తరుపున స్వాగతం పలికిన ఏ ఎస్ పి విభుకృష్ణ, ఐపీఎస్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి మార్చి 24:** నిధి మీనా ఐఏఎస్ జాయింట్ కలెక్టర్ కడప. ప్రొద్దుటూరు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించారు.ప్రొద్దుటూరు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ గా నిధి మీనా ఐఏఎస్, జాయింట్ కలెక్టర్, కడప మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఏ ఎస్ పి విభూ కృష్ణ ఐపీఎస్ , ప్రొద్దుటూరు వన్ టౌన్ సిఐ కొండారెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజగోపాల్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

## క్షయ నివారణ మనందరి బాధ్యత: సిహెచ్‌ఓ లక్ష్మీదేవి



**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 24:-** క్షయ వ్యాధి నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సిహెచ్ఓ లక్ష్మీదేవి తెలిపారు. వజ్రకరూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం భాగంగా ముందుగా ర్యాలీ నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ...రెండు వారాలకుపైగా నిరంతరంగా దగ్గు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను విడనాడాలని, సరైన సమయంలో చికిత్స తీసుకుంటే ఇది పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని తెలిపారు. అలాగే సిగరెట్, బీడీ, హీరా, చైని ఖయిని వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. క్షయ నిర్మూలనలో అధికారులు, వైద్య సిబ్బంది,స్వచ్ఛంద కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ గురు ప్రసాద్, సూపర్వైజర్ నాగశంకర్, ఫార్మసిస్ట్ రామచంద్రనాయక్, ఏఎన్ఎంలు లక్ష్మి,రాజేశ్వరి,ప్రభావతి,ల్యాబ్ టెక్నీషియన్ లలిత, స్టాఫ్ నర్స్ సుజాతతో పాటు ఆశా కార్యకర్తలు ఆదిలక్ష్మి,ప్రభావతి,కళావతి తదితరులు పాల్గొన్నారు.

## 28న న్యూఢిల్లీలో స్కోచ్ అవార్డు అందుకోనున్న కడప జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి

● జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన "స్మార్ట్ కిచెన్ ప్రాజెక్ట్"





**కడప,మన జనప్రగతి మార్చి 24:-**డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన,రుచికరమైన మధ్యాహ్న భోజనమును అందించేందుకు జిల్లాలో వినూత్నంగా చేపట్టిన స్మార్ట్ కిచెన్ విధానము ను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రారంభించారు.. ఈ స్మార్ట్ కిచెన్ విధానం ఒక మోడల్ గా ఉంటూ.. మన్ననలు పొందుతోంది ఈ నేపథ్యంలో జిల్లాలో వినూత్నంగా అమలు చేస్తున్న స్మార్ట్ కిచెన్ ప్రాజెక్ట్ కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించి... ఈ ప్రాజెక్ట్ కు గాను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రతిష్టాత్మకమైన స్కోచ్ అవార్డు India»s Honest Independent Honour కు ఎంపికయ్యారుప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడం,ఆహార భద్రతను పరిరక్షించడం, ఆధునిక యంత్రాలతో వంటశాల మరియు ఆటోమేషన్ వినియోగం, సాంకేతికత సమర్థ వినియోగం, సరైన నిధుల వినియోగం, పంపిణీలో పారదర్శకత వంటి అంశాల్లో ఈ ప్రాజెక్ట్ విశేష ప్రతిభను చూపింది. ఈ కృషి ని గుర్తించిన స్కోచ్ సంస్థ జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ను ప్రశంసించింది. 2026 మార్చి 28 న న్యూ ఢిల్లీ లోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరిగే 106 వ స్కోచ్ సమ్మిట్ అవార్డు ప్రదాన కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వారు. స్కోచ్ అవార్డును స్వీకరించ నున్నారు స్కోచ్ అవార్డు అనేది భారతదేశ అభివృద్ధికి దోహదపడే వ్యక్తులు,సంస్థలు మరియు ప్రాజెక్టులను గుర్తించడానికి స్వతంత్ర స్కోచ్ గ్రూప్ ఇచ్చే ఒక పురస్కారం.

## నిర్భయంగా మట్టి దోపిడీ.. ఎవరి అండ..?ప్రశ్నలు వెల్లువ.!

● చూసీ చూడనట్టు అధికారులు..నిర్భయంగా అక్రమ తవ్వకాలు.

● చెరువులు,ప్రభుత్వ భూములే లక్ష్యం..పర్యావరణానికి ముప్పు.

● పులివెందుల హైవే వైపు మట్టి తరలింపు..భారీగా డబ్బు లావాదేవీలు.



**వేముల మన జనప్రగతి మార్చి 24:-** వేముల మండలంలో మట్టి మాఫియా అడ్డుకట్ట లేకుండా రెచ్చిపోతోంది.ప్రభుత్వ అనుమతులు లేకుండానే రాత్రింబవళ్లు భారీ యంత్రాలతో భూములను లోతుగా తవ్వి,టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న ఘటనలు బహిరంగంగానే కొనసాగుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తోంది.ముఖ్యంగా ప్రభుత్వ భూములు,ఖాళీ స్థలాలు,చెరువుల పరిసర ప్రాంతాలు ఈ అక్రమ తవ్వకాలకు లక్ష్యంగా మారాయి.భూములను అధిక లోతులో తవ్వడం వల్ల పర్యావరణానికి,భూగర్భ జలాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఇక రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయ భూములకు వెళ్లే దారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, మార్గమంతా పెద్ద గుంతలు ఏర్పడటంతో పంటల రవాణా కూడా కష్టమవుతోందని వారు వాపోతున్నారు.ఈ అక్రమంగా తవ్విన మట్టిని పులివెందుల హైవే వైపు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో భారీగా డబ్బులు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయ నష్టం జరుగుతున్నప్పటికీ అధికారులకు చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.కొందరు భయంతో బహిరంగంగా మాట్లాడటానికి కూడా వెనుకాడుతున్నారని తెలుస్తోంది."పెద్దల అండ లేకుండా ఇంత బహిరంగంగా దోపిడీ జరగదు" అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇది అధికారుల నిర్లక్ష్యమా..? లేక మాఫియాకు మద్దతా..? అన్న ప్రశ్నలు గట్టిగా వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా అధికారులు మేల్కొని కఠిన చర్యలు తీసుకుంటారా..? లేక ఈ దోపిడీ ఇదే విధంగా కొనసాగుతుందా అన్నది ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.**మండల తహసిల్దార్ రెడ్డి లక్ష్మి వివరణ..** మట్టి అక్రమ తవ్వకాలపై వివరణ కోరగా మండల తహసిల్దార్ రెడ్డి లక్ష్మి స్పందించారు.ఈ తవ్వకాల గురించి తమకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.అలాగే ట్రక్కుల ద్వారా మట్టి తరలింపుకు ఎక్కడా అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు.సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని,దీనిపై స్థానిక వీఆర్వోల నుంచి సమాచారం కోరగా మండలంలో ఎక్కడా ఇటువంటి తవ్వకాలు జరగలేదని వారు తెలియజేశారని ఆమె పేర్కొన్నారు.



## ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామివారి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం





**ఒంటిమిట్ట మన జనప్రగతి మార్చి 24:-**ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామివారి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మార్చి 27 నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో సంప్రదాయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అర్చన నిర్వహించారు. అనంతరం ఉదయం 8 గంటల నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భాలయం, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ గరుత్మంతుని సన్నిధులు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితరాలను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం ఉదయం 11.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ప్రశాంతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వేసవిలో జాగ్రత్తగా విధులు నిర్వహించండి: కమిషనర్ ఎన్.మౌర్య




**తిరుపతి మన జనప్రగతి మార్చి 24:-** వేసవిలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తగా విధులను నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పారిశుధ్య సిబ్బందికి సూచించారు. వేసవిలో ఉద్యోగులు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుపుతూ, ఓఆర్ఎస్ పాకెట్లను కమిషనర్ ఎన్.మౌర్య, జిల్లా మెడికల్ ఆఫీసర్ బాలకృష్ణ నాయక్, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ పారిశుధ్య కార్మికులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవి ప్రారంభం అయ్యిందని జాగ్రత్తగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఎండలో ఎక్కువ సమయం ఉండకుండా, విధుల సమయాల్లో కూడా మార్పు చేశామని తెలిపారు. ఉదయం త్వరగా విధులకు హాజరై, సాయంత్రం చల్లని సమయంలో పనిచేయాలని తెలిపారు. మీకు ఇచ్చే ఓఆర్ఎస్ పాకెట్లను కాచి ఓడపోసి, చల్లార్చిన నీటిలో కలిపి ఒక రోజులోనే తాగాలని తెలిపారు. ఓఆర్ఎస్ కలిపిన నీరు మరుసటి రోజు త్రాగవద్దని సూచించారు. ఏదైనా అలసట వస్తే చల్లని ప్రదేశాల్లో సేదతీరాలని తెలిపారు. అస్వస్థత కు గురైతే వెంటనే డాక్టర్ ను సంప్రదించాలని తెలిపారు. నగరంలో ప్రజలకు వేసవి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వీధి కుక్కల ఆహారం అందించే ప్రాంతాల్లో కూడా నీటి వసతి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు ఎండ తీవ్రత వల్ల ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అందజేసేందుకు ఓఆర్ఎస్ పాకెట్లు సిద్ధంగా ఉంచామని తెలిపారు. అందులో భాగంగానే నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు పాకెట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఎండల వలన, వడదెబ్బ రాకుండా, వస్తే తీసుకోవాల్సిన జాగ్రతలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ వైద్యులు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## మాట తప్పని మంత్రి కాపు భవన్ ఆధునీకరణకు మరో కోటి రూపాయల సొంత నిధులు

**కలెక్టర్‌కి కోటి రూపాయల చెక్కును అందించిన అల్లుడు పునీత్**

**జూలై నాటికి కాపు భవన్ సిద్ధం: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కీలక ప్రకటన.**




**నెల్లూరు మన జనప్రగతి మార్చి 24:-** కాపులకిచ్చిన మాటను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు మంత్రి నారాయణ నిల బెట్టుకున్నారు .కాపు భవన్ ఆధునీకరణకు కోటి రూపాయల విరాళం ఇచ్చారు .చెక్కును మంత్రి అల్లుడు పునీత్ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అందచేశారు .రెండు విడతల్లో రెండు కోట్లు ఇచ్చిన మంత్రికి కాపు భవన్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు .సామాజిక సేవా కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేస్తున్న మంత్రి నారాయణ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. కాపు భవన్ ఆధునీకరణ కోసం ఇచ్చిన మాట ప్రకారం తన సొంత నిధుల నుండి రెండవ విడతగా రూ. 1 కోటి విరాళాన్ని ప్రకటించారు.మంగళవారం మంత్రి అల్లుడు పునీత్ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి కోటి రూపాయల చెక్కును అందజేశారు. గతంలోనే కాపు భవన్ అభివృద్ధి కోసం కోటి రూపాయల సొంత నిధులు ఇచ్చిన మంత్రి, ఇప్పుడు మళ్ళీ కోటి రూపాయలు కేటాయించడంపై కాపులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ మంత్రి నారాయణ అందించిన ఈ నిధులతో వచ్చే జులై నాటికే కాపు భవన్ ఆధునీకరణ పనులన్నీ పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. తమ అభ్యర్థనను మన్నించి, ఇచ్చిన మాట ప్రకారం మొత్తం రూ. 2 కోట్లు కేటాయించినందుకు కాపు భవన్ కమిటీ సభ్యులు మంత్రి నారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు..కలెక్టర్ హిమాన్షు శుక్లా,మంత్రి అల్లుడు పునీత్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాపుఫ్ భవన్ నాయకులు గాదిరాజు అశోక్ ,పోతరాజు శ్రీనివాస్, అనిల్ కుమార్,గునుకుల కిషోర్ ,భూపతి విజయ కుమార్,పసుపర్తి కిషోర్ కుమార్,శంఖవరపు శ్రీహరి,సూరిశెట్టి గాయత్రి,వనమాల గోవింద రావు,పులి శ్రీనివాసులు ,మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి ,ఉస్మాన్ సాహెబ్ పేట రామాలయ ఛైర్మెన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
25 -03-2026

# సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వలనే ఆర్డీటీకీ ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్

- ఆ రోజు నుంచి మంత్రి లోకేష్ దీనిపై బలంగా నిలబడ్డారు
- ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ పై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆనందం
- ఆర్డీటీ సంస్థకు ఎలాంటి ఆటంకాలు ఉండబోవన్న ఎమ్మెల్యే సునీత




**రాప్తాడు మన జనప్రగతి మార్చి 24:-**ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషి వలనే ఆర్డీటీ సంస్థకు ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ జరిగిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ కి ఆమోదం తెలపడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గత 50ఏళ్లుగా ఆర్డీటీ సంస్థ జిల్లాలో అందిస్తున్న సేవలు వెలకట్టలేనవన్నారు. వేలాది మంది పేదల జీవితాల్ని మార్చిన సంస్థ ఆర్డీటీ అన్నారు. విద్య, వైద్య, వ్యవసాయం, క్రీడల్లో వారు చేసిన సేవలు ప్రభుత్వంతో సమానంగా ఉన్నాయన్నారు. అలాంటి సంస్థకు గత ప్రభుత్వ హయాం నుంచి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇది తమ దృష్టికి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ లను కలిసి పరిస్థితి వివరించామన్నారు. జిల్లా ఎమ్మెల్యేలంతా ఢిల్లీకి వెళ్లగా అక్కడ ప్రత్యేకంగా ఒక ఎంపీని నియమించి.. ఆర్డీటీ ఫైల్ ను ముందుకు కదిలేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలిచ్చారన్నారు. ఆ తర్వాత మంత్రి నారా లోకేష్ కూడా దీనిపై బలంగా నిలబడ్డారన్నారు. తాము ఆయన దృష్టికి సమస్య తీసుకెళ్లినప్పుడు మీరంతా ధైర్యంగా ఉండాలని.. కచ్చితంగా ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ తీసుకొస్తామని భరోసా ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆయన పలుసార్లు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాను కలిసి పరిస్థితిని వివరించారన్నారు. ఇప్పుడు రెన్యూవల్ గా అనుమతులు రావడంతో జిల్లా ప్రజల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. దీని కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ప్రత్యేకంగా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ లో ఆర్డీటీ సంస్థకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

# అరటి రైతులది అరణ్య రోదన పట్టించుకోని ప్రభుత్వాలు

- అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి
- ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల



**సింహాద్రిపురం మన జనప్రగతి మార్చి 24:-** ఇటీవల కురిసిన అకాల వర్షాలు,ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి,అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల.మంగళవారం సింహాద్రిపురం మండలం కసనూరు గ్రామంలో పర్యటించారు.క్షేత్రస్థాయిలో తోటలను సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.అరటి పంటలు దెబ్బతిన్న రైతులు మాట్లాడుతూ గల్ఫ్ దేశాలకు ఎగుమతులు తగ్గడం వల్ల ధరలు దారుణంగా పడిపోయాయని,కనీసం టన్నుకు రూ 15,000 ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పరంగా కోల్డ్ స్టోరేజ్ (శీతలీకరణ గిడ్డంగులు) లేకపోవడం వల్ల పంటను నిల్వ చేసుకోలేక, వ్యాపారులు అడిగిన తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని వివరించారు.మార్కెట్‌లో కల్తీ మందులు,ఎరువుల వల్ల పెట్టుబడి ఖర్చు పెరుగుతోందని,ప్రభుత్వం వీటిపై నియంత్రణ సాధించాలని కోరారు. కోరగుంటపల్లి ప్రాంతంలో గతంలో మంజూరైన కోల్డ్ స్టోరేజ్ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని,దీనిపై ప్రభుత్వం దృష్టి సారించేలా చూడాలని విన్నవించారు.ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ మొన్నటి వరకు టన్నుకు రూ 26,000 పలికిన ధర,ప్రస్తుతం రూ 4,000 కు పడిపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు,దళారులు సిండికేట్‌గా మారి రైతులను నిలువునా ముంచుతున్నారని, దీనిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు.ఎకరాకు 2 నుండి 3 లక్షల రూపాయల పెట్టుబడి పెడితే, గిట్టుబాటు ధర లేక రైతులు కోలుకోలేని దెబ్బతింటున్నారని,ఎకరాకు 30 టన్నుల దిగుబడి వచ్చినా ప్రస్తుత ధరతో కనీసం పెట్టుబడి కూడా రాదని పేర్కొన్నారు.అరటి సాగుకు ప్రధాన కేంద్రమైన పులివెందుల ప్రాంతంలో ఏళ్లుగా అడుగుతున్నా కోల్డ్ స్టోరేజీలు నిర్మించకపోవడం శోచనీయమన్నారు.మాజీ సీఎం జగన్ సొంత నియోజకవర్గంలోనే రైతుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని విమర్శించారు.పంట నష్టపోయిన రైతులకు భీమా అందడం లేదని,గత ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ 170 కోట్ల భీమా బకాయిలను ఇప్పటికీ చెల్లించలేదని ఆరోపించారు.గత వైసీపీ ప్రభుత్వం రూ 3,000 కోట్లు అని ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ 500 కోట్లు అని చెప్పి రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. దీనికి తోడు అకాల వర్షాలతో రైతులు అల్లాడిపోతున్నారని,తక్షణమే ధరల స్థిరీకరణ నిధి నుండి అరటి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.రైతులకు ఇచ్చే మొక్కల విషయంలో కూడా మోసం జరుగుతోందని, నాణ్యమైన జనరిక్ మొక్కలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులకు గిట్టుబాటు ధర కల్పించే వరకు,దళారుల మాయాజాలాన్ని అరికట్టే వరకు కాంగ్రెస్ పార్టీ తరపున పోరాటం చేస్తామని ఈ సందర్భంగా షర్మిల హామీ ఇచ్చారు.ఈ పర్యటన లో కాంగ్రెస్ పార్టీ నాయకులు,స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు: కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి మన జనప్రగతి మార్చి 24:-**విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. మొండి బకాయిల పన్నుల వసూళ్లలో భాగంగా వసూలుకు వెళ్లిన నగరపాలక సంస్థ సచివాలయ ఉద్యోగి పి.నాగార్జున పై దాడి చేయడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగిపై దాడి చేసిన సి.ఎన్.ప్రింటర్స్ యజమాని వసంత కుమార్ పై పోలీస్ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆస్థి పన్ను వడ్డీ పై 50శాతం రాయితీ ప్రకటించింది. ఈ విషయాన్ని అన్ని సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు తెలియజేస్తున్నారు. అందులో భాగంగా ప్రకాశం రోడ్డు లోని సి.ఎన్.ప్రింటర్స్ వారు మూడు సంవత్సరాల నుండి 1, 44,658 రూపాయల బకాయి ఉన్నారు. వడ్డీ పై 50 శాతం తగ్గిస్తే 1,25,820 రూపాయలు చెల్లించాలనే విషయాన్ని తెలియబరిచేందుకు మంగళవారం సచివాలయ కార్యదర్శి నాగార్జున ప్రింటర్స్ వద్దకు వెళ్లి వడ్డీ తగ్గింపు తెలియజేశారు. యజమాని వసంత కుమార్, తదితరులు విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన ఉద్యోగి చెప్పిన మాటలు వినకుండా మమ్మల్నే బిల్లు కట్టమంటావా అంటూ దాడి చేశారు. కమిషనర్ కు సమాచారం అందిచడంతో పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయించి, కేసు నమోదు చేయడం జరిగింది. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు.

# టీ - సేవ ఆన్ లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం




**హైదరాబాద్ మన జనప్రగతి మార్చి 24:-** సేవ ఆన్ లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పంచాయితీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా, సిటీల నుండి అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు టీ–సేవ సెంటర్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. క్రొత్త పాన్ కార్డులు అప్లై, కరెక్షన్ చేయవచ్చు, బస్సు, ట్రైన్, విమానాల టికెట్స్ బుకింగ్స్, బ్యాంకు మనీ ట్రాన్స్ ఫర్లు, ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టం, మైక్రో ఎటిఎం సేవలు, కాష్ డిపోసిట్స్, హెల్త్, బైక్ అండ్ కార్ ఇన్సురెన్సెస్, బిల్లుల చెల్లింపులు, 1000 కి పైగా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఆన్ లైన్ శిక్షణా తరగతుల కు రిజిస్ట్రేషన్, 500 కి పైగా స్కిల్ టెస్ట్ సర్టిఫికేషన్ కొరకు రిజిస్ట్రేషన్, 100 కి పైగా ప్రభుత్వ పరీక్షలకై మాక్ టెస్ట్ ల కై రిజిస్ట్రేషన్ మొదలగు ఆన్లైన్ సేవలను వినియోగ దారులకు అందించడం తో పాటు ఆన్ లైన్ లో వివిధ సేవలను అందిచడం ద్వారా అభ్యర్థులు స్వయం ఉపాధి పొందే వీలుంది. ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్: www.tsevaonline.com ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకునేందుకు చివరి తేదీ: ఏప్రిల్ 09. వివరాలకు ఫోన్: 8179955744 సంప్రదించాలని ఆయన సూచించారు.

# ధనలక్ష్మిపురంలో నారాయణ సిబ్బందితో సమావేశమైన జిఎం విబిఆర్



**నెల్లూరు మన జనప్రగతి మార్చి 24:-** నగర పరిధిలోని ధనలక్ష్మీపురం నందుగల నారాయణ రెసిడెన్షియల్ బాలుర కళాశాలలో మంగళవారం నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి గారు సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హాస్టల్ గదులను, వంట గదులను ప్లే గ్రౌండ్, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి ఫ్యాకల్టీ తో నాణ్యమైన విద్యను అందించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నారాయణ పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించే దిశగా శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే స్కూల్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ క్యాంపస్ ఆవరణలో మొక్కలను సంరక్షించాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యార్థులకు అందించే త్రాగునీరు, భోజనం తదితర ఆహార సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ శుభ్రంగా ఉండేలా చూడాలని తెలియజేశారు. అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని మార్కెటింగ్ పి ఆర్వోలను ఆదేశించారు. ఈ సమావేశంలో కళాశాలల డీన్లు, ప్రిన్సిపాల్, ఏజీఎంలు, ఏవో లు పి ఆర్ ఓ లు పాల్గొన్నారు..

# 11 మందికి రూ 12.85 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఆపన్నహస్తం: భూమిరెడ్డి ఉమాదేవి




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 24:** -అనారోగ్యంతో బాధపడు తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి( సి.ఎం.ఆర్.ఎఫ్) ఆపన్న హస్తమని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సతీమణి శ్రీమతి భూమిరెడ్డి ఉమాదేవి పేర్కొన్నారు.మంగళవారం పులివెందులలో 11 మంది లబ్ధిదారులకు సంబంధించి మంజూరైన రూ.12.85 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మోపూరి దేవస్థానం చైర్మన్ ఓబుళరెడ్డి రమణ రెడ్డితో కలిసి ఆమె పంపిణీ చేశారు.ఈ సందర్భంగా భూమిరెడ్డి ఉమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అండగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు1,36,240 మందికి రూ. 1241 కోట్ల మేర ఆర్థిక,వైద్య సాయాన్ని సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించినట్లు ఆమె వివరించారు.పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని,కష్టకాలంలో ఉన్న కుటుంబాలకు ఈ నిధి గొప్ప భరోసానిస్తుందని కొనియాడారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందేలా నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంకిరెడ్డి, ముచ్చుమర్రి మహేష్, చలామరెడ్డి,మహేశ్వర్ రెడ్డి మరియు లబ్ధిదారులు,వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పులివెందుల మున్సిపాలిటీలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదన్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 24:-** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి అధికారులను కోరారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్,ఆర్డీవో చిన్నయ్యను కలిసి ఆయనకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ప్రజలు ఇబ్బంది పడకుండా మున్సిపాలిటీలో నిరంతరం తాగునీరు అందేలా చూడాలన్నారు.15వ ఆర్థిక సంఘం నిధుల కింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ విషయంలో నిబంధనల ప్రకారమే రుసుము వసూలు చేయాలని,ముఖ్యంగా మున్సిపల్ పరిధిలో గేటు వసూళ్లు గెజిట్‌లో నిర్ణయించిన ధరల మేరకే జరిగేలా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ఆర్డీవో చిన్నయ్యకు వినతి పత్రం అందజేస్తున్న తూగుట్ల మధుసూదన్ రెడ్డితో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

- సిద్ధవటం తహసీల్దార్ హెచ్చరిక



**సిద్ధవటం మన జనప్రగతి మార్చి 24:-** ప్రభుత్వ రెవెన్యూ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సిద్ధవటం మండల తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని జంగాలపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 207లో సుమారు 25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. అందులో కొందరు వ్యక్తులు సుమారు 3 ఎకరాల్లో మామిడి మొక్కలు నాటి ఆక్రమణకు పాల్పడ్డారని, గతంలో వాటిని తొలగించినా మళ్లీ నాటడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత రెండు రోజులుగా సదరు భూమిలో సర్వే నిర్వహిస్తున్నామని, ఆక్రమణలను పూర్తిగా తొలగించి భూమిని స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. రైతులు కేవలం తమకు పట్టా ఉన్న భూముల్లోనే సాగు చేసుకోవాలని, ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

# సీతారాముల సేవలో పద్మశాలీయులు తరించండి


- ఈ నెల 31న పట్టువస్త్రాల సమర్పణ



**సిద్ధవటం మన జనప్రగతి మార్చి 24:-** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని, స్వామివారితో పాటు సీతమ్మ తల్లి, లక్ష్మణ స్వామికి పట్టువస్త్రాలు, సారె సమర్పించే వేడుకను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన, చేనేత విభాగం కార్యదర్శులు పిలుపునిచ్చారు. మాధవరం-1 గ్రామంలో సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, చేనేత విభాగం కార్యదర్శి శ్రీరాందాసు వెంకట్ ఈ మేరకు ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. పద్మశాలి సేవాసమితి ఆధ్వర్యంలో గత ఆరేళ్లుగా ఈ పట్టువస్త్రాల సమర్పణ కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతోందని. ఈ నెల 31వ తేదీ (మంగళవారం) గరుడ సేవ పర్వదినాన ఉదయం 11 గంటలకు భక్తులందరూ ఒంటిమిట్ట ఆలయానికి చేరుకోవాలి. మధ్యాహ్నం 01:00 గంటకు ఆలయ మర్యాదలతో, శాస్త్రోక్తంగా స్వామివారికి పట్టుచీరలు సమర్పిస్తారు. భక్తిశ్రద్ధలతో పద్మశాలీయులు అందజేసే ఈ వస్త్రాలు నేరుగా స్వామివారికే చెందుతాయని నేతలు పేర్కొన్నారు. ఈ పుణ్యకార్యంలో కుల బాంధవులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి, స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

మన
# జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
25 -03-2026

## ఉరవకొండ శ్రీ గవి మఠం హుండీ కానుకల లెక్కింపు నేడు



**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 24:-** అనంతపురం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరవకొండ శ్రీ గవి మఠం సంస్థానంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నేడు బుధవారం నిర్వహించనున్నారు. భక్తులు సమర్పించిన కానుకలను పారదర్శకంగా లెక్కించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10:30 గంటలకు మఠం ప్రాంగణంలో ఈ లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుంది. హుండీ లెక్కింపును ఆలయ సిబ్బంది, అధికారుల సమక్షంలో నియమావళి ప్రకారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ మరియు మేనేజర్ జి.మల్లికార్జున ప్రసాద్ మాట్లాడుతూ..కార్యక్రమం సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని, భక్తులు సహకరించాలని కోరారు.

## కూటమి ప్రభుత్వ ధ్యేయం రైతుల సంక్షేమమే...



**సిద్ధవటం మన జనప్రగతి మార్చి 24:-** రాజంపేట టిడిపి అసెంబ్లీ ఇంచార్జి చమర్తి జగన్ మోహన్ రాజు ఆదేశాల మేరకు, కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని దూదేకుల సంఘం స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు పేర్కొన్నారు. మంగళవారం సిద్ధవటం మండలం, మాధవరం-1 గ్రామంలోని 32వ నంబర్ బూత్ పరిధిలో "అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్" కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా రైతుల ఇళ్లకు వెళ్లి, వారికి 'అన్నదాత సుఖీభవ' నిధులు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలు, ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పెగడ హరిప్రసాద్, మావిళ్ళ మురళి, భాష, శంకర్ రెడ్డి, నర్సింలు, కమాల్ బి మరియు అగ్రికల్చర్ అసిస్టెంట్ మౌనిక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మారుతి నగర్‌లో ట్యాంకర్లతో నీటి సరఫరా



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 24 :-** మండలం లోని ఇడుపులపాయి పంచాయతీ పరిధిలోని మారుతి నగర్ ట్యాంకర్లతో నీటి సరఫరా చేపట్టారు. ఇడుపులపాయి మారుతి నగర్ లోని ఎస్సీ కాలనీలో ఇటివల తాగునీటి పైపు లైన్ పగిలి పోవడంతో నీటి కష్టాలు వచ్చాయి. ఎస్సీ కాలనీ వాసులు నీటితో ఇబ్బందులు పడ్డుతుడడంతో జడ్పీటీసీ రవికుమార్ రెడ్డికి గ్రామస్తులుతీసుకొని పోవడం జరిగింది. ఈనేపథ్యంలో జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఇడుపులపాయి వైసీపీ నేత పోతిరెడ్డి మహేష్ మంగళవారం నీటి ట్యాంకర్లుతో నీటి సరఫరా చేశారు. వైసిపి నేత పోతిరెడ్డి మహేష్ తన సొంత నిధులతో నీటి సరఫరా చేయడంతో మారుతి నగర్ ఎస్సీ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. వేసవి కాలం నీటి ఎద్దడితో అల్లాడుతున్న ఎస్సీ కాలనీ ప్రజలకు నీటి ట్యాంకర్లులతో నీటి సరఫరా చేయడంతో కొద్ది ఉపసమనం దొరికిందని పలువురు ప్రజలు అంటున్నారు. నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని వైసీపీ నేత పోతిరెడ్డి మహేష్ కోరారు.

## శ్రీధరఘట్టలో త్రాగునీటి సమస్యకు పరిష్కారం..కొత్త బోర్ ఏర్పాటు

**బొమ్మనహాల్ మన జనప్రగతి మార్చి 24:-** మండల పరిధిలోని శ్రీధరఘట్ట గ్రామంలో గత కొద్దిరోజులుగా కొనసాగుతున్న త్రాగునీటి సమస్యకు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తో వారి అదేశాలు మేరకు మండల కన్వీనర్ బలరాం రెడ్డి కొత్త బోర్ ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారంగా చర్యలు చేపట్టారు, ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు త్రాగునీటి సమస్య నుండి ఉపశమనం కలగనుంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి, సొసైటీ చైర్మన్ ఎరిస్వామి, గాధిలింగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చంద్ర తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## క్షయ రహిత సమాజమే లక్ష్యంగా అవగాహన ర్యాలీ

● ర్యాలీ ప్రారంభించిన అర్బన్ ఎస్సై మధుసూదన్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 24:-** క్షయను అంతం చేద్దాం ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ను నిర్మిద్దాం అనే నినాదంతో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం-2026 సందర్భంగా పులివెందుల టీబీ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎస్సై మధుసూదన్ రెడ్డి హాజరై, ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అర్బన్ ఎస్సై మధుసూదన్ రెడ్డి మరియు వైద్య నిపుణులు పలు కీలక సూచనలు చేశారు. క్షయవ్యాధి (టీబి ) పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ప్రారంభ దశలో గుర్తిస్తే టీబీని పూర్తిగా నయం చేయవచ్చని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ వ్యాధికి సంబంధించిన పరీక్షలు, మందులు మరియు పౌష్టికాహార సహాయం పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉన్నాయని ప్రజలకు అవగాహన కల్పించారు. టీబీ అనేది అంటువ్యాధి అయినప్పటికీ, సరైన జాగ్రత్తలు మరియు క్రమం తప్పకుండా మందులు వాడటం ద్వారా దానిని అరికట్టవచ్చని, రోగుల పట్ల వివక్ష చూపకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంతి కుమార్, డాక్టర్ ప్రత్యూష, ఏపీఎంఓ సుబ్బారెడ్డి, ఎంపీహెచ్ఈఓ సతీష్ కుమార్, ఐసీటీసీ వెంకటసుబ్బయ్య, ఎంపీహెచ్ఎస్ కృష్ణవేణి, నాగ్లా నాయక్, టొబాకో కౌన్సిలర్ సుమ, టీబీ హెచ్‌వీ భాగ్యలక్ష్మి, సీడీఎస్ మేనేజర్ వల్లి పాల్గొన్నారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు మరియు సీడీఎస్ సిబ్బంది ప్లకార్డులతో పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.


## ఉపాధ్యాయులు,నిరాహార దీక్ష... సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



**రైల్వే కోడూరు మన జనప్రగతి మార్చి 24:-** రైల్వే కోడూరు లో మంగళవారం ఉదయం, ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు రైల్వే కోడూరు ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు తమ వివిధ ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ గతంలో అమలైన 11వ పిఆర్‌సి కారణంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఆర్థికంగా నష్టపోయారని, ప్రభుత్వం మారిన తర్వాత సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించినప్పటికీ ఇప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 జూలై 1 నుండి అమలు కావాల్సిన 12వ పిఆర్‌సి కమిషన్‌ను ఇంకా నియమించకపోవడం, పెండింగ్ డిఏలను విడుదల చేయకపోవడం, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్మెంట్ చెల్లింపులు ఆలస్యమవడం వంటి సమస్యలు తీవ్ర అసంతృప్తికి దారితీస్తున్నాయని తెలిపారు. అలాగే ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిల చెల్లింపుకు స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, హెల్త్ కార్డులు మరియు మెడికల్ బిల్లుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కోవిడ్ సమయంలో మరణించిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పోస్టుకార్డు ఉద్యమం, ధర్నాలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నిరాహార దీక్ష చేపట్టాల్సి వచ్చిందని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

## పేదల జీవితాలతో ఆటలొద్దు

● అధికారం ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే కుదరదు: మాజీ మంత్రి నరసింహం



**కాకినాడ మన జనప్రగతి మార్చి 24 :-** జగ్గంపేటలోపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను వెనక్కి తీసుకోవాలని చేస్తున్న కుట్రలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ జగ్గంపేట గ్రామ పరిధిలోని డ్రైవర్ కాలనీ లబ్ధిదారులు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాకు మాజీ మంత్రి జగ్గంపేట నియోజకవర్గం వైసీపీ కోఆర్డినేటర్ తోట నరసింహం మద్దతు తెలియజేసే, బాధితులు తరపున కలెక్టర్ తో మాట్లాడారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ 2010 సంవత్సరంలో ఆనాటి ప్రభుత్వం డ్రైవర్లకు, ఆశా వర్కర్లకు, ట్రాన్స్ జెండర్స్, ఇతర పేదలకు సుమారు 170 ఇళ్ల స్థలాలను కేటాయించారని, ఆర్థిక ఇబ్బందుల వలన, మౌలిక వసతులు లేక ఆ స్థలంలో ప్రజలు పూర్తిస్థాయిలో ఇళ్ళు నిర్మించుకోలేకపోయారని అన్నారు. చాలామంది బేస్మెంట్ లెవల్ కు కట్టారని, కొంతమంది ఇల్లు పూర్తి చేసుకుని, రేకు షెడ్లు నిర్మాణం చేసుకొని నివశిస్తున్నారని, అన్నారు. లబ్ధిదారులు అందరూ ఐదువేల రూపాయలు చొప్పున సమీకరించి కరెంటు వేయించుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవడానికి వెళుతుంటే రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో అడ్డుకోవడం దుర్మార్గమైన చర్యని అన్నారు. దరిమీల ఆ ప్రాంతంలో భూమి రేట్లు పెరగడంతో అధికార పార్టీకి చెందిన కొంతమంది పెత్తం దారుల కళ్ళు ఆ భూమి మీద పడిందన్నారు. తమ అనుచరులకు ఆ భూములను కేటాయించుకోవడానికి లబ్ధిదారులైన పేదలను ఆ భూములను ఖాళీ చేయించే కుట్రలు చేస్తున్నారని అందులో భాగంగానే పంచాయతీ తీర్మానం చేశారని విమర్శించారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా లబ్ధిదారులను తమ స్థలాల్లోకి వెళ్ళనివ్వకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. తక్షణమే పంచాయతీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని, పేదలను ఆ స్థలాల్లో నుండి వెళ్ళగొట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమస్య పై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, పేదల ఇళ్ల స్థలాలు కాలనీలో మౌలిక వసతులు కల్పించి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్ సి ఎస్ జిల్లా నాయకులు వై సత్తిబాబు, తోట వాసు, షేక్ బాబ్జి, సుబ్బు, భాను ప్రసాద్, కన్నారావు, మణి కుమారి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే అధిక సంఖ్యలో లబ్ధిదారులు కూడా పాల్గొన్నారు.

## ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే సచివాలయం ముట్టడిస్తాం

● యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 24:-** కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని, తక్షణమే తమ డిమాండ్లను నెరవేర్చకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు హెచ్చరించారు. 12వ పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏల విడుదల, ఆర్థిక బకాయిల సాధన కోసం రణభేరి 3.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం పులివెందుల మినీ సెక్రటేరియట్ ఎదురుగా ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ప్రాంతీయ కన్వీనర్ కాయపాటి రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ దీక్షలో మహేష్ బాబు మాట్లాడుతూ 12వ పీఆర్సీ గడువు ముగిసి మూడేళ్లవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పీఆర్సీ చైర్మన్ రాజీనామా చేసినా కొత్త వారిని నియమించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు నెలల్లో బకాయిలు చెల్లిస్తామన్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. 4 డీఏలు పెండింగ్‌లో ఉండగా కేవలం ఒకటి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ అమలయ్యే వరకు 29 శాతం మధ్యంతర భృతి (×=) ప్రకటించాలని, సరెండర్ లీవ్ బకాయిలు, మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలని, రిటైర్డ్ ఉపాధ్యాయుల బకాయిలు మరియు ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ నిరాహార దీక్షలో కాయపాటి రామాంజనేయులు, చప్పిడి శ్రీనివాసులురెడ్డి, సూరా రమేష్ బాబు, చిట్టి పోయిన సుదర్శన్, మేకల శ్రీనివాసులు, తుమ్మల వెంకటరమణ, సాకే అచ్యుత గంగాధర్, గౌతకట్ల ఉషారాణి, పుల్లగూర రాము, రాజశేఖర్ రెడ్డి కూర్చున్నారు. ఈ నిరాహార దీక్షలో కూర్చున్న వారికి సంఘీభావం గా పులివెందుల బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిపిఐ నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్ మరియు ఏఐటీయూసీ నాయకులు తమ మద్దతు ప్రకటించి దీక్షలో పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రమాదకరస్థాయిలో ఎయిడ్స్ వ్యాధి: పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 24:-** రాష్ట్రంలో ప్రమాదకర స్థాయిలో ఎయిడ్స్ వ్యాధి విస్తరిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ఆందోళన వెలిబుచ్చారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2020-2024 మధ్య 5 సంవత్సరాలలో దేశవ్యాప్తంగా ఎయిడ్స్ వ్యాధితో 1,81,000 మంది మృతి చెందినట్లు చెప్పారు. అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 32,642 మంది, తెలంగాణ నుంచి 11,498 మంది మరణించినట్లు తెలిపారు. ఈ వివరాలను కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ రాజ్యసభలో చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. మరణాలలో ఉభయ తెలుగు రాష్ట్రాల వాటా 25 శాతం ఉందన్నారు. ఐటీ రంగంలో ఎయిడ్స్ వ్యాధి శరవేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు కేంద్రమంత్రి చెప్పడం జరిగిందని చెప్పారు. ఒకప్పుడు ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమాలు, జాగ్రత్త చర్యలు పెద్ద ఎత్తున ఉండేవని తెలిపారు. ఇటీవల కాలంలో ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోవడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఎయిడ్స్ పట్ల అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేసి ఎయిడ్స్ వ్యాధి విస్తరణను అడ్డుకోవాలని తులసిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లెం విజయ్ భాస్కర్, కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

## పట్టాభికి కాలమే బుద్ధి చెబుతుంది: వైసిపి నాయకులు డాక్టర్ నాగార్జున్ రెడ్డి, గుంటి నాగేంద్ర



**కడప మన జనప్రగతి మార్చి 24:-** స్వచ్ఛ ఆంధ్ర చైర్మన్ పట్టాభి సీతారాంకు కాలమే బుద్ధి చెబుతుందని వైఎస్ఆర్ పార్టీ కడప జిల్లా డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, యువజన విభాగ అధ్యక్షుడు గుంటి నాగేంద్ర లు పేర్కొన్నారు. మంగళవారం ఈ సందర్భంగా కార్యకర్తల మధ్యలో పట్టాభి దిష్టిబొమ్మతో గాడిదపై ఊరేగించి పెట్రోల్ పోసి దిష్టిబొమ్మ తగలబెట్టారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ పట్టాభి డిబేట్లో కూర్చొని వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని అనకూడని పదజాలంతో వైయస్సార్ పార్టీ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయినప్పుడు సీఎం సీట్ కోసం జగన్ సంతకాల సేకరణ చేశాడని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ విషయంపై అనేక మాజీ మంత్రులు వివరణ ఇచ్చారు. సోషల్ మీడియాలో ఇప్పటికి రన్ అవుతుంది జగన్మోహన్ రెడ్డి యొక్క దమ్ము, ధైర్యం కడప గల్లీ నుంచి దేశం ఢిల్లీ వరకు తెలిసిందని వారు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పై పోకస్ పెట్టకుండా అబద్దాలపై ఫోకస్ పెట్టి అప్పుల రాష్ట్రమని తెలియకుండా ప్రజలను డైవర్ట్ చేస్తున్నారన్నారు. కల్తీ మధ్యలో జగన్ కాలంలో ఎలాంటి మరణాలు లేవని కేంద్ర ప్రభుత్వమే నివేదిక ఇచ్చింది. కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యాన్ని ఒక ప్రైవేట్ ఇండస్ట్రీగా దొంగలు తయారు చేస్తున్నారు. దాని వలన ఎన్నో మరణాలు జరుగుతున్నాయని ప్రజలందరికీ తెలుసు అన్నారు. కొంతమంది వైసిపి నాయకులు విసిరిన సవాలను షర్మిలమ్మ, సునీతమ్మ ఎందుకు సమాధానం చెప్పలేకపోతున్నారని ప్రశ్నించారు. వీరిద్దరు కూడా చంద్రబాబు నాయుడు భ్రమలో ఉండి జగన్మోహన్ రెడ్డికి వెన్నుపోటు పొడుస్తున్నారు. ప్రతి ఒక్కరికి 2029లో కాలమే సమాధానం చెబుతుందని వారు పేర్కొన్నారు. అలాగే జనసేన పార్టీ మహిళా సుభాషిని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి శ్రీమతి భారతి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్టియుసి నగర అధ్యక్షులు నాగరాజు, కంచుపాటి బాబు, సత్యం, నరసింహ ,సాయి, పవన్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

మన
# జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక



## బంజారా సంఘం నుంచి ప్రధానమంత్రి,ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 24:-**అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సేవలు అందిస్తున్న గ్రామీణ అభివృద్ధి ట్రస్ట్ సంస్థకు విదేశీ నిధుల నియంత్రణ చట్ట అనుమతి పునరుద్ధరణ జరగడం పట్ల బంజారా సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.మంగళవారం స్థానికంగా పాత్రికేయులతో మాట్లాడిన బంజారా సంఘం ప్రతినిధి, సంస్థ కమిటీ సభ్యుడు ఎస్.కే. సుబ్రహ్మణ్యం నాయక్ మాట్లాడుతూ, ఈ సంస్థ ఆసియా ఖండంలోనే మచ్చలేని సేవా సంస్థగా పేరు గడించిందన్నారు.గత ఏడాది విదేశీ నిధుల రాక నిలిచిపోవడంతో అనుమతి పునరుద్ధరణ కోసం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అనేక ఉద్యమాలు జరిగినట్టు తెలిపారు.ఆ ఉద్యమాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అనుమతిని పునరుద్ధరించడం హర్షణీయమని పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు దివంగత ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ పేదలకు విశేష సేవలు అందించి అనంతపురం జిల్లా మాత్రమే కాకుండా రాష్ట్ర ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు.ప్రస్తుతం అనుబంధ సంచాలకుడు మంచో ఫెర్రర్ అదే స్ఫూర్తితో సేవలను కొనసాగిస్తూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారని అభినందించారు.అనుమతి పునరుద్ధరణ పట్ల బంజారా సంఘం జాతీయ నేత కేశవ నాయక్, బీజీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మహేష్ బంజారా,ఎంపీ స్వామి నాయక్ ఫౌండేషన్ అధ్యక్షుడు కమల్ సింగ్ రాథోడ్, మాజీ జడ్పీటీసి తులసీదాసు నాయక్,గౌరవ సభ్యులు వాళ్లే నాయక్,విద్యా కమిటీ అధ్యక్షుడు కె. వెంకటేష్ నాయక్,మాజీ సర్పంచ్ సోమీబాయి,రామక్క భాయ్ తదితరులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హులైన పేదలకు ఇల్లు స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మాణాలు చేపట్టాలి:సిపిఐ



**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 24:-**అర్హులైన పేదలను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ పార్టీ నాయకులు ప్రభుత్వం డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు మంగళవారం ఉరవకొండలో తాసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రధాన డిమాండు పేద ప్రజలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించిందని అయితే అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నప్పటికీ కూడా ప్రభుత్వం తమ హామీని అమలుచేయడంలో విఫలమైందన్నారు. కరవు జిల్లాలో అధిక సంఖ్యలో బడుగు, బలహీను వర్గాల ప్రజలు బాడుగ ఇంట్లో ఉండి ఇంటి అద్దె చెల్లించలేక పోతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వ ఎన్నికలలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూమి లేని నిరుపేదలను గుర్తించి భూ పంపిణీ చేయాలని, అర్హులైనవారికి రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని అంతేకాకుండా పట్టణాల్లో,గ్రామాల్లో దళితవాడల్లో శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తా ఉన్నారు. అనంతరం తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు బసవరాజు,ఉరవకొండ మండల కార్యదర్శి మోహన్, పార్టీ సీనియర్ నాయకులు గన్నే మల్లేష్, కాజా తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పి హెచ్ ఎస్ పాఠశాలలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు




**సిద్దవటం మన జనప్రగతి మార్చి 24:-** ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భాకరాపేట జెడ్పీహెచ్ఎస్ (11వ బెటాలియన్) పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. క్షయ వ్యాధి పట్ల భయం వద్దని, సరైన సమయంలో చికిత్స పొందితే టీబీని పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్ బాష మాట్లాడుతూ, వ్యాధులపై అపోహలు వీడి శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని కోరారు. పాఠశాల హెడ్మాస్టర్ పోతులూరయ్య, సైన్స్ టీచర్ రవికుమార్ విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ విలువిద్య పోటీలకు మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఆహ్వానం

**- చెరుకూరి లెనిన్ - వాల్గా మెమోరియల్ న్ టీ పీసీ " ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ విలువిద్య (ఆర్చరీ) ఛాంపియన్‌షిప్**



**రాయచోటి మన జనప్రగతి మార్చి 24:-** తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారిని చెరుకూరి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. చెరుకూరి లెనిన్ - వాల్గా మెమోరియల్ న్ టీ పీసీ " ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ విలువిద్య (ఆర్చరీ) ఛాంపియన్‌షిప్ పోటీలు మార్చి 26 నుండి ఏప్రిల్ 6, 2026 వరకు గుంటూరు జిల్లా నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి అంతర్జాతీయ సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరుగనున్నాయాని మంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్, చెరుకూరి వోల్గా ఆర్చరీ అకాడమీ సంయుక్తంగా నిర్వహించగా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మద్దతు అందిస్తోంది.ఈ సందర్భంగా మంత్రి కార్యక్రమానికి హాజరుకావాలని నిర్వాహకులు మంత్రికి ఆహ్వానం పలికారు.

## ప్రవీణ్ పగడాల వేడుకలు ఘనంగా జరిగినవి

**ప్రతి దైవ సేవకుడు పగడాల ప్రవీణ్‌గా ఆదర్శం**

**ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్**



**కడప మన జనప్రగతి మార్చి 24:-** కడప నగరం రాజీవ్ పార్క్ ఐపీసీ చర్చిలో క్రైస్తవ దైవ సేవకులు ప్రవీణ్ పగడాల వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగినవి. ఈ సందర్భంగా మల్లెం విజయభాస్కర్ మాట్లాడుతూ. ప్రవీణ్ పగడాల గొప్ప దైవ సేవకుడని ఆయన సువార్త పరిచర్యలో క్రీస్తును గురించిన బోధలు అనేక ప్రజలకు తెలిపారని ఆయన కడప జిల్లా ప్రొద్దుటూరు ప్రాంతంలో జన్మించారని. కడప రాజారెడ్డి వీధి లో ఉండేవారన్నారు. హైదరాబాదు ప్రాంతం నుంచి రాజమండ్రి కి బైక్ లో ప్రయాణించగా గత సంవత్సరం మార్చి 24వ తేదీన మరణించారని తెలిపారు నేటికీ ఆయన సేవలు గణనీయమన్నారు. బిషప్ కే శామ్యూల్ బాబు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల ఎంతోమంది అనాథలను దిక్కులేని వారిని ఆదరించేవాడు అన్నారు,టీవీ చర్చ వేదికలో అనేక బోధనల ద్వారా క్రైస్తవుల మత గ్రంథాలలోని సత్యాన్ని తెలిపే వారన్నారు. ఈ కార్యక్రమంలో వర్షిప్ ఆరాధన బ్రదర్ ప్రశాంత్ జరిగించారు. వాక్య సందేశం బ్రదర్ అరుణ్ కుమార్ అందించారన్నారు ప్రవీణ్ పగడాల కొంతమంది దైవ సేవకులు ఆయన చేసిన సేవలు గురించి కొనియాడారు. దేగల శామ్యూల్. మస్తాన్. వీరదాసరి భాస్కర్, రాజరత్నం. కటారి బాబు ఎద్దుల ప్రసాద్. సి జె సి క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ రాష్ట్ర అధ్యక్షులు మోజెస్. తెలిపారు. ఈ కార్యక్రమంలో బిషప్ డానియల్. విజయ శేఖర్. అక్కి దాసరి మార్కు. రాజన్న. సుభార్. డేవిడ్ రాజ్ తిమోతి అమ్ములు. భారతి. విజయమ్మ తదితరులు పాల్గొన్నారు అనంతరం అందరు ప్రేమ ఉందో పాల్గొన్నారు

## ఆడపిల్లలు అన్ని రంగాలలో ముందుండాలి

**జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి**







**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 24:-**బాలికలు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలు, సామాజిక అంశాలు ఇలా అన్ని రంగాలలో రాణించాలని వైఎస్సార్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి పిలుపునిచ్చారు.కెనడా దేశానికి చెందిన ఓటీఎఫ్/యఫ్ఈఓ సంస్థ సహకారంతో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో పులివెందుల బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు మంగళవారం క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు.ప్రధానోపాధ్యాయులు ఏ.సి. గంగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థినులకు పలు సూచనలు చేశారు.తల్లిదండ్రులు,గురువుల కష్టాన్ని గుర్తించి,చదువును నిర్లక్ష్యం చేయకుండా అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు.ప్రతి బాలిక ధైర్యంగా మాట్లాడటం నేర్చుకోవాలని,లభించే ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు.తన పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు.స్నేహిత అమృత హస్తం సేవాసమితి ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థినులలో శారీరక దృఢత్వం,మానసిక ఉల్లాసం పెంపొందించేందుకు అంతర్జాతీయ సంస్థల సహకారంతో ఈ క్రీడా సామగ్రిని అందజేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి మస్తాన్ బాషా,సభ్యులు చాంద్ బాషా,ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం కృష్ణారెడ్డి,శైలజ, వ్యాయామ ఉపాధ్యాయులు ఫ్రాన్సిస్,రమేష్ రెడ్డి మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## లయోలా కళాశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ రోవర్స్ యూనిట్ ప్రారంభం




**పులివెందుల టౌన్ మన జనప్రగతి మార్చి 24:-**స్థానిక పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో మంగళవారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ రోవర్స్ యూనిట్ను ఘనంగా ప్రారంభించారు.కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జోజిరెడ్డి,స్కౌట్ ఇంచార్జి సాయి నరేంద్ర కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.కడప జిల్లా భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి,నూతనంగా చేరిన రోవర్స్‌కు స్కార్ఫ్ మరియు ఓగళ్లను అలంకరించి యూనిట్‌లోకి సాదరంగా ఆహ్వానం పలికారు.ఈ సందర్భంగా జిల్లా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.విద్యార్థుల్లో క్రమశిక్షణ,సేవా భావం పెంపొందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.భవిష్యత్తులో ఈ సర్టిఫికెట్ల వల్ల లభించే విద్యా,ఉద్యోగ అవకాశాల గురించి మరియు వ్యక్తిత్వ వికాసం గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కడప జిల్లా భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ అసిస్టెంట్ సెక్రటరీ ఖాదర్ భాషా, సంయుక్త కార్యదర్శి వెంకట సుబ్బయ్య,అసిస్టెంట్ కమిషనర్ అమర్నాథ్ బాబు, రోవర్స్ యూనిట్ లీడర్ అహమ్మద్,కళాశాల రోవర్స్ మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఏప్రిల్ 3 నుంచి ఉచిత పాలీసెట్ కోచింగ్: జెవివి

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మార్చి 24 :-**జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 03 వ తేదీ నుంచి పదవ తరగతి పూర్తి అయిన విద్యార్థులకు పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ టెస్టు పాలీసెట్ 2026 కోసం ఉచితంగా కోచింగ్ ను స్థానిక శివాలయం పక్కన గల నందిని క్లాత్ మార్కెట్ నందు గల జెవివి ఆఫీసులో ఇవ్వనున్నట్లు జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపీనాథ్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నంగా రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పాలీసెట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఉచిత పాలీసెట్ కోచింగ్ ను ఇవ్వడం అభినందనీయమని, విద్యార్థులు 9705333305 ఫోన్ చేసి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ బెస్ట్ ఫ్యాకల్టీలతో ఈ ఉచిత కోచింగ్ ను నడుపుతున్నట్లు, విద్య ఉచితంగా అందించాలనేదే జనవిజ్ఞాన వేదిక ఆశయమని అన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.సునీత, అల్లా బకస్, ఈశ్వరయ్య, రవిబాబు, నరేష్,నాగరాజు, గురు శేఖర్ రెడ్డి, రమణ, మధుసుధన్ రెడ్డి, మురళీ గుప్త, డా.మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, తిరుమలకొండు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 24:-**తీర ప్రాంత మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.మంగళవారం నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు కొల్లు రవీంద్ర,ఆనం రామనారాయణ రెడ్డిల అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు.తమిళనాడు జాలర్ల అక్రమ చొరబాటు సమస్యను శాశ్వతంగా అరికట్టాలని,ఇందుకోసం కోస్ట్ గార్డ్ మరియు పోలీస్ శాఖల మధ్య సమన్వయం పెంచాలని రామగోపాల్ రెడ్డి సూచించారు.జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పరిధిలో అక్రమ పడవల ప్రవేశాన్ని అడ్డుకోవాలని,అక్కడ భద్రతా లోపాలను సరిదిద్ది పర్యవేక్షణను బలోపేతం చేయాలని అధికారులను కోరారు.స్థానిక మత్స్యకారుల ఆర్థిక, సామాజిక సమస్యలపై చర్చించిన ఆయన వారి జీవనోపాధికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందని భరోసా ఇచ్చారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి,వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి,కావ్య కృష్ణారెడ్డి,పాశం సునీల్ కుమార్, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలతో పాటు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల,ఎస్పీ అనిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవ అవగాహన ర్యాలీ



**బొమ్మనహల్ మన జనప్రగతి మార్చి 24:-**ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని శ్రీధరఘట్ట గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో టిబి వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. టిబి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.అదేవిదంగా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ, విద్యార్థులతో కలిసి గ్రామ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి టిబి నివారణపై చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో బి.విజయభాస్కర్, మెడికల్ ఆఫీసర్ డా,కుమార్ రాజా,డా.గీతా భార్గవి,సిహెచ్ఓ రుక్మిణి,హెల్త్ ఎడ్యుకేటర్,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు,పాఠశాల విద్యార్థులు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## నాగన్నగుట్ట పాలెంలో శ్రీ యల్లమ్మ బోనాల విందులో పాల్గొన్న సుగవాసి ప్రసాద్ బాబు




**రాయచోటి మన జనప్రగతి మార్చి 24:-** గాలివీడు మండలం ఎగువ గొట్టివీడు గ్రామ పరిధిలోని నాగన్నగుట్ట పాలెంలో మంగళవారం జరిగిన శ్రీ యల్లమ్మ బోనాల ఉత్సవాల్లో రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు పాల్గొన్నారు.గ్రామానికి చెందిన యన్ చలపతి నాయుడు మరియు యన్ మధుకర్ నాయుడుల ఆహ్వానం మేరకు ఆయన ఈ విందు కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో రాష్ట్ర పాలఏకిరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర నాయుడు తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
25 -03-2026

## ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్ధరణ - ప్రజా పోరాటానికి ఘన విజయం

**● జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వై. మధుసూదన్ రెడ్డి**



**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 24:**–దాదాపు ఆరు దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాలలో పేద ప్రజల అభివృద్ధి కోసం సేవలందిస్తున్న ఆర్డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్ధరణ లభించడం ప్రజా పోరాటానికి దక్కిన ఘన విజయం అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వై. మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు.గత ఏడాది నుంచి ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్ధరణ లేకపోవడంతో ఆర్డిటి సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. నిధుల కొరత కారణంగా సంస్థ కార్యకలాపాలు సంక్షోభంలో పడటమే కాకుండా,ఆస్తులను అమ్మకానికి పెట్టి ప్రాంతాన్ని విడిచి వెళ్లే పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలు, దళిత–బహుజన సంఘాలు,కుల సంఘాలు,మేధావులు,విద్యావంతులు కలిసి విస్తృతంగా ఉద్యమాన్ని చేపట్టారు.ఈ ఉద్యమానికి ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా విశేష మద్దతు అందించగా, ఆర్డిటి లబ్ధిదారులు కూడా పెద్ద ఎత్తున స్పందించారు. జిల్లా బంద్, అమరావతికి పాదయాత్ర వంటి రాజీలేని కార్యక్రమాలకు సిద్ధమవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చివరకు ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్ధరణ మంజూరు చేశాయి.ఈ విజయాన్ని యావత్తు ప్రజల విజయం గా అభివర్ణించిన వై.మధుసూదన్ రెడ్డి,ప్రజా హక్కులకు భంగం కలిగినప్పుడు ఐక్యంగా పోరాడితే విజయం సాధ్యమని ఈ సంఘటన నిరూపించిందన్నారు.భవిష్యత్తులో కూడా ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ,ముఖ్యంగా మీడియా ప్రతినిధులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## జీఎస్టీ గమ్యస్థాన పన్ను: వైవియువిసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్





**కడప, మన జనప్రగతి, మార్చి,24:**–వస్తు సేవల పన్ను అనేది దేశ అభివృద్ధికి గమ్యస్థాన పన్ను అని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఎంబీఏ శాఖ ఆధ్వర్యంలో "నెక్స్ట్ జన్ జీఎస్టీ సంస్కరణలు (జీఎస్టీ 2.0): దక్షిణ భారత రాష్ట్రాల్లో స్తోమత, ఉపాధి, ఆరోగ్యం, స్థిరత్వం , వికసిత్ భారత్ పై ప్రభావం (జిఎస్టి ఏ ఈ హెచ్ ఎస్–2కె26)" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ ను మంగళవారం అన్నమాచార్య సేనెట్ హాల్లో విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ –2047 లక్ష సాధనలో భాగంగా "వన్ నేషన్ వన్ టాక్స్" నినాదంతో భారతదేశం ఆర్థిక అభివృద్ధి దిశగా ముందుకు వెళుతోందన్నారు. జీఎస్టీ 2.0 రెండు రోజుల సదస్సులో లోతైన అధ్యయనం జరిగి, పరిశోధకులకు విద్యార్థులకు ప్రయోజనం చేకూరాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్‌వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ టి. రమేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వ్యాపార ఆరోగ్య రంగాల్లో పన్నుల ప్రాధాన్యత, దేశ రాష్ట్రాలలో ఆరు పెత్తనం గురించి వివరించారు. విధానాలపై అవగాహన కల్పిస్తూ వివిధ రకాల వస్తువుల ధరలు ప్రజల ప్రయోజనాల గురించి తెలిపారు. తిరుపతిశ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ పి. మోహన్ రెడ్డి మాట్లాడుతూ 2017 సంవత్సరం నాటి జిఎస్టి కి 2025 నాటి జీఎస్టీ కి తేడాలను వివరించారు. 15 శాతం , 18 శాతం, 40శాతం పన్నుల గురించి అవగాహన కల్పించారు. జీఎస్టీ 2.0 వల్ల ఎలక్ట్రికల్ వాహనా లు, మెడిసిన్ సంబంధించి ప్రజలకు ప్రయోజనం చేకూరిందని తెలిపారు. వై వి యు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ సదస్సుకు అధ్యక్షత వహించి జీఎస్టీ ప్రయోజనాలను కొన్నింటిని వివరించారు. యూనివర్సిటీ అఫ్ హైదరాబాద్‌ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ , పాండిచేర్రి యూనివర్సిటీ ప్రొఫెసర్ కె. లావణ్య లత, స్కూల్ ఆఫ్ కామర్స్ లా అండ్ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ వైస్ సుబ్బారాయుడు, కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ విజయభారతి మాట్లాడుతూ జీఎస్టీ లోని పలు విభాగాలపై ఉపన్యసించారు.ఎంబీఏ శాఖ అధిపతి, సెమినార్ కన్వీనర్ డాక్టర్ పి.సరిత మాట్లాడుతూ ఈ సెమినార్ కు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సదరన్ రీజినల్ సెంటర్ (ఐ సి ఎస్ ఎస్ ఆర్–ఎస్ ఆర్ సి) స్పాన్సర్షిప్ అందిస్తోందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రంగంలో వస్తున్న సంస్కరణలపై అధ్యాపకులు, స్కాలర్ లు, విద్యార్థులు చర్చించుకోవడం ఈ సెమినార్ ముఖ్య ఉద్దేశమన్నారు.ఈ కార్యక్రమంలో ఎంబీఏ శాఖ సహ ఆచార్యులుడా. ఎస్. సుబ్బారెడ్డి, డా. ఎస్.వి. సుబ్బారెడ్డి,డా. అమృత్ ప్రసాద్ రెడ్డి, టి. అనిల్ దేవ కుమార్, వి. వెంకట రమణయ్య, పి. రాజశేఖర్, పి. సుధీర్ కుమార్, ఎస్. అబ్దుల్ , విద్యార్థులు స్కాలర్లు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి పట్ల భయపడవలసిన అవసరం లేదు.

**నివారణకు మందులు ఉన్నాయి**

**చెన్నూరు పీహెచ్సీ. వైద్యాధికారి. డాక్టర్ వినయ్ కుమార్ రెడ్డి**



**చెన్నూరు. మన జనప్రగతి మార్చి,24:**–క్షయ వ్యాధి పట్ల భయపడవలసిన అవసరం లేదని నివారణకు మదులు ఉన్నాయని చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం లో భాగంగా మంగళవారం చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి డాక్టర్లు వైద్య సిబ్బంది క్షయ వ్యాధి నివారణ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం డాక్టర్ వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్షయ వ్యాధిని ఆరు నెలల్లో పూర్తిగా నయం చేయవచ్చని తెలియజేశారు. దగ్గు జ్వరము బరువు తగ్గడం రాత్రివేళ చెమటలు పట్టడం ఇలా రెండు వారాల నుంచి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయ వ్యాధి నివారణ కోసం మందులు సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటసుబ్బయ్య. ఎం ఓ చందన. ఎం ఈ ఓ. గంగిరెడ్డి . వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంతాప సందేశం

**సీనియర్ జర్నలిస్ట్ "షౌకత్ హెచ్ మహమ్మద్ (63) అకాల మరణం పట్ల దిగ్భ్రాంతి, తీవ్ర సంతాపం వ్యక్తంచేసిన సి. ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్.**




**విజయవాడ, మన జనప్రగతి మార్చి 24 :**–సీనియర్ జర్నలిస్ట్ "షౌకత్ హెచ్ మహమ్మద్(63) అకాల మరణం పట్ల సి. ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీ ఆలపాటి సురేశ్ కుమార్ దిగ్భ్రాంతి, తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో స్వల్ప అనారోగ్యంతో, చికిత్సపొందుతూ షౌకత్ ఈరోజు(మంగళవారం) తుదిశ్వాస విడిచారని ఆయన ఒక సంతాప సందేశంలో పేర్కొన్నారు. వ్యక్తిగతంగా తాను ఒక మంచి మిత్రుడిని, విలువైన సహచరుడిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విశాఖ కు చెందిన "షౌకత్" డక్కన్ క్రానికల్ డెస్క్ జర్నలిస్టు గా 1985 లో జర్నలిజం లో ప్రవేశించారని ఆయన గుర్తు చేసుకున్నారు. షౌకత్ ఇండియన్ ఎక్స్ ప్రెస్, టైమ్స్ ఆఫ్ ఇండియా, ఎకనామిక్ టైమ్స్ వంటి వివిధ వార్తా పత్రికల్లో పనిచేశారు. హైద్రాబాద్ లోని డక్కన్ క్రానికల్ లో బిజినెస్ ఎడిటర్ గా బాధ్యతలు నిర్వహించారు. అంతకు ముందు మళయాల మనోరమ గ్రూప్ కు చెందిన "ది వీక్" కు తమిళనాడు ప్రతినిధి గా కొన్ని సంవత్సరాలు పని చేశారు. ఈ మధ్యకాలంలోనే, కొన్ని సంవత్సరాలు " టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్" లో సీనియర్ కన్సెల్టెంట్ గా పనిచేశారు. ఆంధ్ర ప్రదేశ్ విభజన తర్వాత విజయవాడలో టైమ్స్ ఆఫ్ ఇండియా స్పెషల్ కరెస్పాండెంట్ గా కొన్ని సంవత్సరాలు పని చేశారు. అదే ఆయన ఆఖరి ఎస్సైన్మెంట్. విరివిగా చదివే అలవాటు ఉన్న షౌకత్ బిజినెస్ జర్నలిజంలో తనదైన ముద్ర వేశారు. వృత్తి నియమాలను తుచ తప్పక పాటించిన షౌకత్ నిబద్ధత కలిగిన జర్నలిస్టు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు.

## 28న సంత మార్కెట్‌కు వేలం పాట

**వేంపల్లె మన జనప్రగతి మార్చి 24:**–వేంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని సంత మార్కెట్ కు ఈ నెల 28న సంత మార్కెట్ కు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగభూషణం రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేంపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని వారాంతపు సంత బహిరంగ వేలం పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. వేలంకు హాజరైన వారు రూ 40 లక్షల డిడిని గ్రామపంచాయతీ కార్యదర్శి పేరుతో తీసి రెండు రోజుల ముందే కార్యాలయంలో సమర్పించాలని కోరారు. గ్రామపంచాయతీ ఆర్థిక స్థితిగతులను బట్టి గుత్తేదారులు స్వయంగా మార్కెట్ సదుపాయం కల్పించుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

## సమయపాలన పాటించని సబ్ రిజిస్ట్రార్... అవస్థల్లో రైతులు, ప్రజలు



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 24:**–వేంపల్లె సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అధికారులతో పాటు కొందరు సిబ్బంది కూడ సమయ పాలన పాటించడం లేదు. దీంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులు, ప్రజలు అవస్థలకు గురి అవుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి ప్రభుత్వ అధికారితో పాటు కార్యాలయ సిబ్బంది కూడ 10 గంటలకు విధులకు తప్పకుండా హాజరు కావాల్సి ఉంది. అయితే వేంపల్లెలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రం ప్రతి రోజూ సబ్ రిజిస్ట్రార్ అధికారినే 11.30 గంటలకు వస్తుడడంతో ప్రజలు, రైతులు సబ్ రిజిస్ట్రార్ అధికారి కోసం గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే అధికారినే ఆలస్యంగా వస్తున్నది తాము కూడ ఎందుకు ఆలస్యంగా వస్తామని కొందరు సిబ్బంది కార్యాలయంకు ఆలస్యంగా వస్తుడడంతో కార్యాలయంలో కుర్చీలు ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి. పనులు అన్ని విడిచి పెట్టి రిజిస్ట్రేషన్లు చేసుకొనేందుకు ఉదయాన్నే రైతులు, ప్రజలు కుటుంబ సభ్యులతో కార్యాలయం వద్దకు చేరుకొంటున్నారు. అయితే అధికారులకు మాత్రం రైతులు, ప్రజలు పడుతున్న అవస్థలు మాత్రం పట్టించుకోకుండా వారికి ఇష్టం వచ్చిన సమయంలో కార్యాలయంకు రావడం జరుగుతున్నది. సమయ పాలన పాటించని అధికారులకు ప్రశ్నించే వారు లేక పోవడంతో విధులకు ఇష్టారాజ్యంగా హాజరు అవుతున్నారని రిజిస్ట్రేషన్ కొరకు వచ్చిన పలువురు రైతులు, ప్రజలు వాపోతున్నారు. ఇష్టారాజ్యంగా విధులకు వస్తున్న సబ్ రిజిస్ట్రార్ అధికారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకొని రైతులు, ప్రజల కష్టాలను తొలగించాలని కోరుతున్నారు. భూతులు గాని, స్థలాలు గాని రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే గంటల తరబడి ఉడ్డాల్సిన పరిస్థితి వేంపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నెలకొందని ప్రజలు మండిపడ్డుతున్నారు.

## ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు పోరాటం ఆగదు




**చిట్వేలి మన జనప్రగతి మార్చి 24:**– 2024 సంవత్సరం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇండ్ల స్థలాలు అందజేయాలని సీపీఐ రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ చిట్వేలి మండల నాయకులు తిప్పన ప్రసాద్ ఆధ్వర్యంలో చిట్వేలి మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చాలని అన్నారు. పట్టణంలోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇళ్ళు లేని నిరుపేదలకు ఇళ్ళు, ఇళ్లస్థలాల మంజూరు చేయాలని అన్నారు. గత 2024 ఎన్నికల సమయంలో ఇళ్ళు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలంతో పాటుగా ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చి కూటమి నేతలు అధికారంలోకి వచ్చారని తెలిపారు. అధికారం చేపట్టి దాదాపు 2 సంవత్సరాలు గడుస్తున్నా సెంటు భూమి కూడా పంచలేదని అన్నారు. వేలాది ఎకరాలు అప్పనంగా కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతూ పేదలను విస్మరించడం దుర్మార్గమని మండిపడ్డారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు భారత కమ్యూనిస్టు పార్టీ పోరాడుతునే ఉంటుందని స్పష్టం చేశారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా నేటికి ఇళ్ల స్థలాల కోసం పేదలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం విచారకరం అన్నారు. ఒకే ఇంటిలో నాలుగు ఐదు కుటుంబాలు కలిసి జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ గ్రామ శాఖ కార్యదర్శి పోలే లక్ష్మీదేవి, గంగయ్య, పోలీస్ శివమ్మ, పెంచలమ్మ, పేద ప్రజలు పాల్గొన్నారు.

## కడప ఎయిర్‌పోర్ట్‌లో షర్మిలకు కాంగ్రెస్ నేతల స్వాగతం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి మార్చి 24:**–కడప జిల్లా పర్యటనకు విచ్చేసిన ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డికు కడప విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాష స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని షర్మిలకు అభివాదం తెలిపారు. పూల మాలలు, శాలువాలతో సత్కరించి ఆమెకు స్వాగతం చెప్పారు. జిల్లాలో పార్టీ బలోపేతం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సమావేశాలు నిర్వహించేందుకు షర్మిల పర్యటన కొనసాగనుంది.

## ఆర్డిటి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




**బొమ్మనహాల్ మన జనప్రగతి మార్చి 24:**–మండల పరిధిలోని ఉద్దేహాల్ గ్రామంలో ఆర్డిటి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సంస్థ ఏరియా టీమ్ లీడర్ వెంకటేశులు,సిఓ.కృష్ణయ్య, హనుమంతరాయుడు,నాగరాజు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా టీం లీడర్ మాట్లాడుతూ.. మహిళల సాధికారత,వారి హక్కులు,సమాజంలో వారి పాత్రపై అవగాహన కల్పించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని,స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు.

## ప్రజా సంఘాల పోరాట ఫలితమే..ఆర్‌డీటీ విదేశీ నిధుల అనుమతి పునరుద్ధరణ



**బొమ్మనహాల్ మన జనప్రగతి మార్చి 24:**–ఆర్‌డీటీ సంస్థకు విదేశీ నిధుల స్వీకరణ (ఎఫ్‌సీఆర్‌ఏ) అనుమతి పునరుద్ధరించబడినందుకు ఎస్సీ, ఎస్టీ ప్రజా సమాఖ్య రాష్ట్ర నాయకుడు సాకే రమేష్ హర్షం వ్యక్తం చేశారు.విదేశాల నుంచి వచ్చే నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిన నేపథ్యంలో,దళిత ప్రజా సంఘాలు మరియు ఆర్‌డీటీ లబ్ధిదారులు నిరంతరం చేసిన పోరాట ఫలితంగానే ఈ అనుమతి తిరిగి లభించిందని ఆయన తెలిపారు.ఆర్‌డీటీ ద్వారా అనేక గ్రామాల్లో పేదలు, దళితులు, మహిళలు,పిల్లలకు విద్య, ఆరోగ్యం,ఉపాధి రంగాల్లో అందుతున్న సేవలు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు విదేశీ నిధులు ఎంతో అవసరమని, వాటి పునరుద్ధరణ వల్ల సంస్థ కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయని అన్నారు.ఈ సందర్భంగా ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతి పునరుద్ధరణకు సహకరించిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సాకే రమేష్ ధన్యవాదాలు తెలిపారు.

## 26న చెన్నూరులో సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ.

**చెన్నూరు మన జనప్రగతి మార్చి 24:**– మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చెన్నూరు మండలంలోని 10 గ్రామపంచాయతీలలో 01.04.2024 నుండి 31.03.2025 వరకు జరిగిన పనులపై ఫిబ్రవరి 4 నుండి 20వ తేదీ వరకు మరియు మార్చి 5 నుండి 17 వరకు సామాజిక తనఖీ జరిగిందని మండల అభివృద్ధి అధికారి.కిరణ్ మోహన్ రావు తెలిపారు.ఈ సామాజిక తనిఖీపై గుర్తించిన అంశాల గురించి 26వన ఉదయం 10 గం.లకు చెన్నూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణములో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంపై సామాజిక తనిఖీ కార్యక్రమము పైన ప్రజా వేదిక ఏర్పాటు చేయడమైనదని, కావున ఈ కార్యక్రమమునకు సంబంధించిన అందరు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావలసినదిగా కోరారు .

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174